ప్రజాశక్తి

శనివారం 19 జులై 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

ఖరీఫ్‌కు ఊపిరి

కొనసాగుతున్న వర్షాలు - సాగుకు సిద్ధమవుతున్న రైతులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటలకు పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. శని, ఆదివార్లాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. వర్షాలు కొనసాగుతుండటంతో ఖరీఫ్ సాగుపై రైతుల్లో ఆసక్తిని పెంచింది. గత 40 రోజులుగా వర్షాల్లేక ఖరీఫ్ సాగుకు ఈ ఏడాది తీవ్ర జాప్యమైంది. తాజాగా వానలతో రైతులు ఇప్పటికిప్పుడు పత్తి, మిర్చి, వరి సాగుకు సిద్ధం కానున్నారు. డెల్టాలో ఇప్పటికే కాల్వలకు నీరు వస్తుండటంతో వర్షాలు కూడా తోడు కావడం వల్ల సేద్యానికి ఊపిరిపోసినట్టు అయిందని రైతులు చెబుతున్నారు.

గుంటూరు జిల్లాలోని మేడికొండూరు, గుంటూరు పశ్చిమ, గుంటూరు తూర్పు, కొల్లిపర, తెనాలి, వట్టిచెరుకూరు, చేబ్రోలు, దుగ్గిరాల, ప్రత్తిపాడు, పెదనందిపాడులో భారీ వర్షం కురిసింది. ఫిరంగిపురం, మంగళగిరి, కాకుమాను, పొన్నూరు, తుళ్లూరు, తాడికొండ, తాడేపల్లి, పెదకాకానిలో మోస్తరుగా కురిసింది. పలు కొన్ని మండలాల్లో వాతావరణం చల్లబడినా జల్లులే పడ్డాయి. గుంటూరులో కురిసిన భారీ వర్షానికి మిర్చియార్డులో కొన్ని టిక్కీలు తడసిపోయాయి. పలు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. జిల్లా మొత్తం మీద సగటున 45.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా మేడికొండూరులో అత్యధికంగా 136.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గుంటూరు తూర్పులో 96.4,పశ్చిమలో 94.6, కొల్లిపర 60.2, తెనాలి 58.2, వట్టిచెరకూరు 56.2, చేబ్రోలు 44, దుగ్గిరాల 43.6, ప్రత్తిపాడు 40.4, పెదనందిపాడు 34.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

జిల్లా మొత్తం మీద ఈఏడాది ఖరీఫ్‌లో 2.25 లక్షల ఎకరాల్లో పంటలను సాగు చేస్తారని అంచనా వేయగా ఇప్పటి వరకు 22వేల ఎకరాల్లోనే పంటలను సాగు చేశారు. ఇప్పటి వరకు కేవలం 10 శాతం విస్తీర్ణంలో సాగైనట్లు అధికారులు తెలిపారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి, నాదెండ్ల, నరసరావుపేట, యడ్లపాడు, పిడుగురాళ్ల, నూజెండ్ల, బొల్లాపల్లిలో భారీ వర్షం, మిగతా మండలాల్లో మోస్తరు వర్షం కురిసిందని అధికారులు తెలిపారు. ఈ వర్షం మరో రెండు రోజులు కొనసాగితే వచ్చే వారంలో ఖరీఫ్ పనులు ఊపందుకుంటాయని అధికారులు భావిస్తున్నారు. ప్రధానంగా మెట్ట ప్రాంతంలో పత్తి, డెల్టాలో వరిసాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు.



తూర్పుపాలెంలోని ఎంపియుపి పాఠశాల అవరణలో నిలిచిన వర్షపు నీరు

బడిని ముంచిన వాన

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులో శుక్రవారం కురిసిన భారీ వాననీరు స్థానిక తూర్పుపాలెంలోని ఎంపియుపి పాఠశాలను ముంచెత్తింది. పాఠశాల ఆవరణతోపాటు తరగతి గదుల్లోకి కూడా నీరు చేరడంతో సమీపంలోని ధూపాటి జార్జి ఇంటి భాగంలోని రేకుల షెడ్డులో తరగతులు నిర్వహించాల్సి వచ్చింది. డ్రెయినేజీల పూడిక తీయకపోవడంతో ఈ సమస్య తలెత్తినట్లు స్థానికులు చెబుతున్నారు. దీనిపై పంచాయతీ అధికారులను గతంలో పలుమార్లు విన్నవించగా జనం పంచాయతీ పన్నులు చెల్లించని కారణంగా కాల్వల పూడిక తీయడం లేదని సమాధానమిచ్చారని అన్నారు. పనుల్లేక పన్నులు చెల్లించలేక పోయామని చెప్పారు. ఇదిలా ఉండగా గతంలో ఈ పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులు ఉండేవారని, వర్షపు నీరు వస్తుండడంతో విద్యార్థులు పలుమార్లు అసౌకర్యానికి గురయ్యేవారని, క్రమంగా సంఖ్య తగ్గుతూ వచ్చిందని గ్రామస్తులు గుర్తు చేస్తున్నారు.



సిఎం చంద్రబాబును సన్మానిస్తున్న ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ పి.సత్యనారాయణన్

తక్కువ ఖర్చుతో హరిత ఇంధనం ఉత్పత్తి

ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో రెండ్రోజుల సమ్మిట్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని ప్రాంతంలోని నీరుకొండ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం జాతీయ స్థాయి గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్-2025 శుక్రవారం ప్రారంభమైంది. రెండ్రోజులపాటు జరిగే ఈ సదస్సును సిఎం చంద్రబాబు ప్రారంభించగా దేశ, విదేశాల నుంచి పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తలు, గ్రీన్ హైడ్రోజన్‌పై పరిశోధనలు చేస్తున్న నిపుణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ వాతావరణ కలుషితం నుంచి బయటపడాలంటే గ్రీన్ హైడ్రోజన్ ఒక్కటే మార్గమన్నారు. తక్కువ ఖర్చుతో హరిత ఇంధనం తయారీ విరివిగా జరగాలని సూచించారు. యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ పి.సత్యనారాయణన్ స్వాగతోపన్యాసం చేస్తూ గ్రీన్ హైడ్రోజన్ పై పరిశోధనలతో పాటు ఉత్పత్తికి ముందుకు వచ్చే పరిశ్రమలకు సాంకేతిక సహకారం అందించేందుకు ఎస్ఆర్ఎం వర్సిటీ సిద్ధంగా ఉందన్నారు. నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ వీకే సారస్వత్ మాట్లాడుతూ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి కేంద్రం లక్ష్యాలను నిర్దేశించి నిధులను కేటాయించినట్టు తెలిపారు. గ్రీన్ హైడ్రోజన్ తయారీ, నిల్వలకు దోహదపడే సంస్థలకు కేంద్రం వివిధ రూపాల్లో సహకారం అందిస్తుందన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ హరిత ఇంధనం తయారీ విషయంలో మన దేశం అగ్రదేశాలతో పోటీ పడాలని, పారిశ్రామికవేత్తలు పెద్ద ఎత్తున పెట్టుబడులతో ముందుకు రావాలని కోరారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి.నారాయణరావు మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో యూనివర్సిటీలో ఇన్నోవేషన్ ▶ 2లో



ధర్నాలో మాట్లాడుతున్న శివశంకరరావు

డిఎస్సీ 2003 ఉపాధ్యాయులకు ఒపిఎస్ అమలు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

డిఎస్‌సి-2003 ఉపాధ్యాయులకు సిపిఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 2003 డిఎస్సీ ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో గుంటూరు కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా చేయగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందలాది మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షులు మోపిదేవి శివశంకరరావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్) అమలు కాకముందే 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల ఎంపిక పూర్తయ్యిందని, కానీ సాంకేతిక కారణాల వల్ల నియామకాలు ఆలస్యమయ్యాయని చెప్పారు. అయినా 2004 సెప్టెంబర్ తర్వాత నియామకాలు పొందారనే పేరుతో పాత పెన్షన్ కాకుండా సిపిఎస్ అమలు చేయటం అన్యాయమన్నారు. అప్పటి నుండి ఉపాధ్యాయులు ఒపిఎస్ కోసం పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోట్లేదన్నారు. అప్పట్లోనే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మోమె 57 ప్రకారం నోటిఫికేషన్ పాత పెన్షన్ పరిధిలో ఉంటే చేరిక ఆలస్యమైనా పాత పెన్షన్ వర్తిస్తుందని చెప్పారు. దేశంలోని దాదాపు 15 రాష్ట్రాల్లో మెమో 57ను అమలు చేశారని, రాష్ట్రంలోని ముగ్గురు ఐఎఎస్ అధికారులకు కూడా వర్తింప చేశారని, కానీ రాష్ట్రంలో 13 వేల మంది టీచర్లకు మాత్రం వర్తింప చేయలేదని విమర్శించారు. తక్షణమే ఒపిఎస్ వర్తింప చేసేందుకు చర్యలు తీసుకోకుంటే పోరాటం ఉధృతం అవుతుందని ఉద్ఘాటించారు. ఉపాధ్యాయులకు పిడిఎఫ్ అండగా ఉంటుందన్నారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షులు శివశంకరరావు మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా ఒపిఎస్ ▶ 2లో



గుంటూరు సమ్మె శిబిరంలో మద్దతుగా మాట్లాడుతున్న పాశం రామారావు



నరసరావుపేట ఆర్‌డిఒ కార్యాలయ అధికారికి వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

కొసాగుతున్న ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

వివిధ ప్రజాసంఘాలు మద్దతు

ప్రజాశక్తి-గుంటూరు, నరసరావుపేట

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని, గత 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని, షరతులేమీ లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఇందులో భాగంగా ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గుంటూరులోని తక్కెళ్ళపాడు హెడ్ వాటర్‌వర్క్స్ వద్ద జరుగుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నిరవధిక సమ్మె శుక్రవారంతో 6వ రోజుకు చేరుకుంది. సమ్మెకు సంఘీభావంగా కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు మాట్లాడుతూ ఒక కుటుంబం సాధారణ జీవితం గడపాలంటే కనీసం రూ.26 వేలు ఇవ్వాలని సుప్రీం కోర్టు చెప్పిందని, దానిని అమలు చేయాల్సిన ప్రభుత్వాలు అమలు చేయకుండా మీనమేషాలు లెక్కబెడుతుందని విమర్శించారు. గత సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలకు జి.ఓలు ఇవ్వాలని సంవత్సరం నుంచి కోరుతున్నా ప్రభుత్వం స్పందించకపోవటం అన్యాయమని అన్నారు. వెంటనే మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారంచేసి సమ్మె విరమింపచేయాలని, లేకుంటే మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెకు అన్ని ప్రజా సంఘాలు మద్దతుగా ఆందోళనకు పూనుకుంటాయని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం, నగరపాలక సంస్థ అధికారులు షోకాజ్ నోటీసులు, ఉద్యోగాల నుంచి తీసేస్తామని బెదిరింపులకు పూనుకోవటం తగదని అన్నారు. డిమాండ్స్ పరిష్కారం గురించి పట్టించుకోనందువల్లనే కార్మికులు అసహనానికి గురై పోరాటాల్లో పాల్గొంటున్నారని, వెంటనే ప్రభుత్వం స్పందించి మున్సిపల్ ▶ 2లో

పెట్రోల్ పోసి హత్యచేసిన కేసులో నిందితుడు అరెస్టు -2వ పేజీ

తక్కువ ఖర్చుతో హరిత ఇంధనం ఉత్పత్తి

(మొదటి పేజీ తరువాయి)

సెంటర్ను ప్రారంభించనున్నామని, భవిష్యత్తో హైడ్రోజన్ పవర్ ట్రైన్, కార్లను అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

అనంతరం వివిధ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. ప్రభుత్వం తరపున సిఎం చంద్రబాబు, రెన్యూవబుల్ ఎనర్జీ కార్పొరేషన్ ఎమ్‌డి కమలాకర్‌బాబు పత్రాలను అందుకోగా ఆయా కంపెనీ ప్రతినిధి గాల్ బాగిన్ ఎంవోయూ పత్రాలను స్వీకరించారు. మచిలీపట్నం, కృష్ణపట్నం మధ్య ఏర్పాటు చేయనున్న ఈ రెండు ప్రాజెక్టుల వల్ల 10 వేల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని అంచనా వేశారు. రూ.35 వేల కోట్లతో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు ఏర్పాటు కానున్నాయని సిఎం చంద్రబాబు తెలిపారు. సదస్సుకు ముందు చంద్రబాబు వివిధ పరిశ్రమల మేనేజింగ్ డైరెక్టర్లతో ప్రత్యేకంగా సమావేశమై గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, అనుకూల పరిస్థితులు, అవసరమైన సహకారంపై చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, యూనివర్సిటీ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ సతీష్ కుమార్, సినర్జన్ గ్రీన్ ఎనర్జీ కంపెనీ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రణవ్ తంతి, సీఎస్ ఐఆర్ డైరెక్టర్ ఆశిష్ లేలే, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్‌తేజ, సబ్ కలెక్టర్ సంజన సిన్హా పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.రాజశేఖర్‌రావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు పోరాటాలు కొత్త కాదని, పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోగలమని తెలియజేశారు. అడుక్కుంటే వచ్చేది భిక్షని.. పోరాడితే వచ్చేది హక్కులని చెప్పారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరావు మాట్లాడుతూ గురువారం సిడిఎంఎ కార్యాలయం వద్ద ధర్నా సందర్భంగా అధికారులు రెండు, మూడ్రోజుల్లో జీతాల పెంపు ప్రకటన చేస్తామని తెలియజేశారని, వేతనాలు పెంచే వరకూ సమ్మె కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్షులు పూనేపల్లి శ్రీనివాసరావు, ఆర్.కాశయ్య, షేక్.బాషా, శ్రీకాంత్, జోసెఫ్, నాగరాజు, గాలి శ్రీనివాసరావు, సిద్దాబత్తిన శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, ఒ.మహేష్, గాలి నరేష్, ఎం.మహేష్, ఆర్యుగం, సుబ్రమణ్యం, బి.రవి పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో 300మందికిపైగా కార్మికులు ఆర్‌డిఓ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చి తమ గోడును వెళ్లబోసుకున్నారు. తొలుత సమ్మె శిబిరాన్ని సిఐటియు పల్నాడు జిల్లా కోశాధికారి డి.శివకుమారి సందర్శించి మద్దతుగా మాట్లాడారు. పెరుగుతున్న ధరలతో మున్సిపల్ కార్మికుల బ్రతుకులు దిగజారుతున్నాయని, చాలీచాలని జీతాలతో, భద్రత, సౌకర్యాలు లేక ప్రమాదం అంచున పని చేస్తున్నారని చెప్పారు. వీరికి కనీస వేతనాలతోపాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్, ప్రమాద బీమా, అన్ని రకాల ప్రభుత్వ పథకాలు కల్పించాలని కోరారు. అప్పటి వరకూ కార్మికులు పోరాడాలని, వారికి అండగా ఉంటామని చెప్పారు. అనంతరం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు సిలార్ మసూద్ మాట్లాడారు. కౌలురైతు సంఘం అధ్యక్షులు కె.రామారావు మద్దతు తెలిపారు. బి.నాగేశ్వరావు, లక్ష్మారెడ్డి, షేక్ చిన్న, అల్లాబక్షు, సోమశేఖరు, కె.శ్రీనివాసరావు, బాలాజీ సింగ్, షకీలా, శ్రీను, బి.శ్రీను, కిరణ్‌కుమార్, సంగమేశ్వరరావు, మాలిక్, వెంకట్, నాగేశ్వరరావు, జి.వాసు, నాగకుమారి, రమణ, కాసిం, పి.ఏసు, సామ్రాజ్యం, రమాదేవి, విజయమ్మ, జీవరత్నం, విజయలక్ష్మి, వీరకుమార్, జాను, పాల్గొన్నారు.

ఒపిఎస్ అమలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

కోసం ఎదురు చూస్తున్నామని, ఉపాధ్యాయుల సహనాన్ని పరీక్షించొద్దని అన్నారు. ధర్నాకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యు.రాజశేఖర్‌రావు, ఎపిటిఎఫ్ 1938 జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారావు, నాయకులు సంతోష్, ఎపిటిఎఫ్ 257 అధ్యక్షులు బసవలింగారావు, ఎస్‌టియు కె.విజయ్‌బాబు, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ బి.హైమారావు, అవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిష్టీ, మాజీ ఎమ్మెల్సీ ఎఎస్ రామకృష్ణ మద్దతు తెలిపారు. సమస్య పరిష్కారం అయ్యే వరకూ పోరాడతామని చెప్పారు. ధర్నాలో పోరం జిల్లా కన్వీనర్ ఎస్.ప్రసన్నకుమార్, నాయకులు రాయిడి శ్రీధర్, ఎస్.యలమంద, ఎం.శ్రీనివాసరావు, యుటిఎఫ్ నాయకులు జి.వెంకటేశ్వరరావు, ఎం.కోటిరెడ్డి పాల్గొన్నారు.

పెట్రోల్ పోసి హత్యచేసిన కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - వినుకొండ

నూజెండ్ల మండలం ఐనవోలు గ్రామంలో ఈనెల 16వ తేదీన తెల్లవారుజామున భార్యాభర్తలపై పెట్రోల్ పోసి నిప్పంటించడంతోపాటు నీలబోయిన మంగమ్మ (54) మృతికి కారణమైన కేసులో నిందితుడు నీలబోయిన యలమందను అరెస్టు చేసినట్లు నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వివరాలను శుక్రవారం వెల్లడించారు. ఆయన వివరాల ప్రకారం.. నీలబోయిన పెద్ద శ్రీను, మంగమ్మ దంపతులు, వారి కొడుకూ కోడళ్లయిన బ్రహ్మయ్య, నాగమణి ఒకే ఇంట్లో ఉంటున్నారు. ఇంటి మరమ్మతుల కారణంగా వీరు 15 రోజుల నుండి ఇంటి ఎదురుగా ఉన్న వేముల వెంకటేశ్వర్లు పొలంలోని పొగాకు కొట్టంలో నివాసం ఉంటున్నారు. ఇంటి నిర్మాణం సమయంలో వివాదం రావడంతో పెద్ద శ్రీను మరదలు చిన్నమ్మాయి, భార్య మంగమ్మ, కోడలు నాగమణిల మధ్య గొడవ జరిగింది. చిన్నమ్మాయిని పెద్దశ్రీను దూషించడంతోపాటు కొట్టాడు. గతంలో పొలం విషయంలోనూ ఎలమందను తిట్టడంతో అతనిపై ఎలమంద కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో పెద్ద శ్రీను, అతని భార్య మంగమ్మ ఆరుబయట నిద్రిస్తుండగా ఈనెల 16న తెల్లవారుజామున వారిపై ఎలమంద పెట్రోలు పోసి నిప్పంటించి పారిపోయారు. క్షతగాత్రులను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కొద్దిసేపటికి మంగమ్మ మృతిచెందింది. పెద్ద శ్రీను ఇప్పటికీ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాడని డీఎస్పీ వివరించారు. ఎలమందును వినుకొండ రూరల్ సీఐ ప్రభాకర్, అయినవోలు, బండ్లమోటు ఎస్సైలు అయినవోలులో శుక్రవారం అరెస్టు చేసినట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు

చెన్నుపాటి ఇండో అమెరికన్ ఫార్మసీలో ఇంక్యుబేషన్ ఇన్నోవేట్ ఇంపాక్ట్ సెంటర్ ప్రారంభం



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మారుతున్న సమాజానికి అనుగుణంగానే ఫార్మసీ రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట మండలం జొన్నలగడ్డలోని చెన్నుపాటి ఇండో అమెరికన్ స్కూల్ ఆఫ్ ఫార్మసీలో ఇంక్యుబేషన్ ఇన్నోవేట్ ఇంపాక్ట్ సెంటర్‌ను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ఫార్మసీ విద్యలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు సాగుతున్న చెన్నుపాటి ఇండో అమెరికన్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మసీ కాలేజ్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కె.వీరయ్య, చేబ్రోలు హనుమయ్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ - హెచ్ఓడి ఆఫ్ ఫార్మాస్యూటిక్స్ డాక్టర్ జంగా రమేష్ మాట్లాడుతూ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంక్యుబేషన్ ఇన్నోవేట్ ఇంపాక్ట్ సెంటర్ ద్వారా నూతన ఆవిష్కరణలు చేయాలని చెప్పారు. ప్రిన్సిపల్ డాక్టర్ చెన్నుపాటి సురేష్ మాట్లాడుతూ అత్యాధునిక నాణ్యత ప్రమాణాలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధనలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సిఎఒ చేకూరి సాంబశివరావు, రీసెర్చ్ డైరెక్టర్ రఘువీర్‌వర్మ, చైర్మన్ పవన్, ఏఓ కె.రమేష్ పాల్గొన్నారు.

మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్‌గా రాజబోయిన

ప్రజాశక్తి - మాచర్ల : మాచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా రాజబోయిన మల్లేశ్వరి మధుయాదవ్‌ను నియమితులయ్యారు. వైస్ చైర్మన్‌గా గుండాల లక్ష్మి, డైరెక్టర్లుగా గోపవరపు చెన్నకేశవ, పోలూరి అప్పారావు, కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సంచుల నాగేశ్వరరావు, పంగా శ్రీనివాసరావు,



కొమ్ము మరియమ్మ, పోట్లవత్ రోశమ్మ, చీదెళ్ల ఆంజనేయులు, చింతమల్ల వెంకట్రావు, గుర్రాల లక్ష్మమ్మ, ఏలూరి ఉమామహేశ్వరరావు, పేరువాల సునీత, షేక్ సైదాబీ నియమితులయ్యారు. వీరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - మాచర్ల : పట్టణంలోని 132/33 కెవి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం దుర్గి మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని డిఇఇ ఎ.రామయ్య శుక్రవారం తెలిపారు. దుర్గి, పోలేపల్లి, ధర్మవరం, కోలగొట్ల, ఎన్ఎస్ తండా, ముటుకూరులలోని 33/11 కెవి సబ్ స్టేషన్స్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపేస్తామని పేర్కొన్నారు.

ఎరువుల దుకాణాల్లో డిఎఒ తనిఖీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

యూరియా కొనుగోలు చేయడానికి వచ్చే రైతులకు వేరే ఎరువులు ఏదైనా కొనుగోలు చేయాలని రైతులను ఇబ్బంది పెడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని వారి లైసెన్స్ రద్దు చేస్తామని ఎరువుల వ్యాపారులను పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.జగ్గారావు హెచ్చరించారు. నరసరావుపేట పట్టణంలో శుక్రవారం ఎరువుల దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌కు సరిపడా ఎరువులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచామన్నారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరి బిల్లు పొందాలని, బిల్లు ఇవ్వకున్నా, అధిక ధరలకు అమ్మినా అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. అన్ని రైతు సేవ కేంద్రాలలో యూరియా గ్రామ స్థాయిలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టామని, రైతులు దరఖాస్తు చేసుకుంటే సరఫరా చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏడిఏ కెవి రామారావు, మండల వ్యవసాయ శాఖ అధికారి ఐ.శాంతి పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో మంత్రి ప్రచారం

ప్రజాశక్తి- చిలకలూరిపేట : సూపర్-6 హామీలన్నీ కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మండలంలోని లింగంగుంట్ల, కావూరు, కోమటినేనివారిపాలెం, గంగన్నపాలెం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి మంత్రి పాల్గొన్నారు. తాగునీరు సరఫరా కోసం రూ.30 లక్షలతో ఏర్పాటు చేసిన తాగునీటి పథకాన్ని మంత్రి, ఎమ్మెల్యే ప్రారంభించారు.

చీఫ్‌విప్‌కు 185 అర్జీలు

ప్రజాశక్తి - వినుకొండ : వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీలన్నింటికీ పరిష్కారం చూపుతామని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక తన కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించిన ఆయన 185 అర్జీలు స్వీకరించారు. విద్యుత్, రెవెన్యూ సమస్యలు, పింఛన్లు సహా తదితర అంశాలకు సంబంధించి ఫిర్యాదులు వచ్చాయి. ప్రతి శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చీఫ్‌విప్ చెప్పారు.

స్వచ్ఛ అవార్డు.. ప్రజలు, కార్మికులకు అంకితం



ప్రజాశక్తి-గుంటూరు

స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన 'సూపర్ స్వచ్ఛలీగ్ సిటీస్ 2024-25' పోటీల్లో గుంటూరు నగరపాలక సంస్థకు లభించిన ప్రతిష్టాత్మక అవార్డు నగర ప్రజలు, ప్రజారోగ్య కార్మికులకే అంకితమని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. గుంటూరు నగరానికి జాతీయ స్థాయిలో అవార్డు అందిన సందర్భంగా శుక్రవారం జిఎంసి కౌన్సిల్ హాల్లో మేయర్, కమిషనర్లు మీడియాతో మాట్లాడారు. మేయర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో గుంటూరు నగర ఖ్యాతిని చాటడంలో అధికారులు, ప్రజారోగ్య కార్మికుల కృషితో పాటు ప్రజల భాగస్వామ్యం తోడ్పడిందన్నారు. అతి తక్కువ కాలంలో గుంటూరు నగరంలో జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించడం పట్ల ఇండోర్ అధికారులు కూడా వివరాలడిగి తెలుసుకున్నారన్నారు. ఇదే స్ఫూర్తితో గుంటూరు నగరంలో వీధి దీపాలు, పారిశుధ్యం మెరుగుదల, తాగునీటి సరఫరా, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్ ఏర్పాటు చేసి 10 ఏళ్లు నిండిన సందర్భంగా దేశంలో గతంలో ర్యాంకులు వచ్చి, ప్రస్తుతం స్వచ్ఛత ప్రమాణాల్లో ఉన్నత స్థానంలో నిలిచిన 23 నగరాలను సూపర్ స్వచ్ఛ లీగ్ నగరాలుగా ప్రకటించిందని, వాటిలో 3 నుండి 10 లక్షల జనాభాలోపు నగరాల్లో గుంటూరు నగరపాలక సంస్థ నిలిచిందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, స్టేక్ హోల్డర్స్, ప్రజారోగ్య కార్మికుల సమిష్టి భాగస్వామ్యం, కృషితోనే గుంటూరు నగారానికి ఈ గుర్తింపు లభించిందన్నారు. జిఎంసి పరిధిలో ప్రత్యేకించి ప్రజారోగ్య విభాగంలో కార్మికుల హేతుబద్ధీకరణ, పారిశుధ్యం మెరుగుదలకు అవసరమైన వస్తువులు, వాహనాలను అందుబాటులోకి తీసుకురావటం, మెరుగైన పర్యవేక్షణ కోసం శానిటరీ డివిజన్ల పెంపు ద్వారా, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి సూచనలతో మెరుగైన ఫలితాలు సాధించామన్నారు. త్వరలో సి అండ్ డి వేస్ట్ ట్రీట్మెంట్ ప్లాంట్, ఎస్‌టిపి, వెండింగ్ జోన్ల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నామన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

కలెక్టర్ అభినందన

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జిఎంసి జాతీయ స్థాయిలో అత్యుత్తమ అవార్డులను సాధించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గుంటూరు నగరానికి అత్యుత్తమ అవార్డు వచ్చిన సందర్భంగా శుక్రవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు కలెక్టర్‌ను క్యాంప్ కార్యాలయంలో కలిసి వారి చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ అవార్డు రానున్న కాలంలో నగర ప్రజలకు మెరుగైన పారిశుధ్యాన్ని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడానికి మరింత ప్రోత్సాహంగా ఉంటుందన్నారు. అనంతరం ఒక జిల్లా - ఒక ఉత్పత్తి కేటగిరీలో గుంటూరు మిర్చికి జాతీయ స్థాయిలో లభించిన అవార్డును అందుకున్న జిల్లా కలెక్టర్‌కు కమిషనర్, అదనపు కమిషనర్లు శుభాకాంక్షలు తెలిపారు.

తెనాలి కేనన్ ఎక్స్‌పో

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఫోటోగ్రఫీలో నిష్ణాతులైన గోటోగ్రాఫర్స్‌ను ఒకటి చేస్తూ తెనాలి వీడియో గ్రాఫర్స్ అండ్ ఫోటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కేనన్ ఎక్స్పో నిర్వహించారు. స్థానిక కొత్తపేట ఎన్జీవో కార్యాల యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో హైదరాబాద్ నుంచి వచ్చిన కేనన్ అధ్యాపకులు మాస్ట్రో దనిశెట్టి రాంబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఫోటోగ్రఫీలో మెళకువలను ఎప్పటి కప్పుడు అధ్యయనం చేయాలని వర్ధమాన ఫోటో గ్రాఫర్లకు సూచించారు. అనంతరం కార్యదర్శి వి.మణికాంత్ మాట్లాడారు. కార్యక్రమంలో తెనాలి వీడియో గ్రాఫర్స్ అండ్ ఫోటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కోశాధికారి సిహెచ్ శేఖర్, సభ్యులు అంకమహేష్, కారుమంచి సునీల్ సందీప్, కె.గౌతం, సాయి, సుబ్రహ్మణ్యం, రాంబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన రోటరీ క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

రోటరీ క్లబ్ ఆఫ్ ఇండియా తెనాలి మంగళగిరి బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కంఠం రాజు కొండూరు గ్రామపరిధిలో ఉన్న శ్రీ మహం కాళి అమ్మవారి గుడి ఆవరణలో క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ జన్మదినం సందర్భంగా మొక్కలు నాటారు. ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ అన్ని ప్రభాకర రావు గుడి ఈవో సునీల్ కుమార్ క్లబ్ సభ్యులు ఎన్ వెంకటేశ్వరావు జివి నారాయణ ప్రగడ రాజశేఖర్ నిరంజన్ గుప్తా జి శ్రీనివాస రావు మురళి ఇన్ బాలకృష్ణ ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

విజన్ ఇండియా, స్వర్ణాంధ్ర, పి4పై కాలేజీలో సదస్సు

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండల కేంద్రంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పెదనందిపాడు ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు కాళహస్తి సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు విజన్ ఇండియా 2047, స్వర్ణాంధ్ర 2047, పి4, అనే అంశాల మీద సెమినార్ ప్రోగ్రాం నిర్వ హించారు. సెమినార్‌కి రిసోర్స్ పర్సన్‌గా, గ్లోబల్ ఫోరమ్ ఫర్ సస్టయినబుల్ ట్రాన్స్ఫర్మేషన్, ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్, స్వర్ణాంధ్ర 2047, విజన్ డాక్యుమెంట్ డిజైన్ కమిటీ మెంబర్ డాక్టర్ వెలమాటి రామనాథ్ హాజరై కళాశాల విద్యార్థులకు ఇండియన్ ఎకానమీ ఈజ్ గ్లోబల్ ఎకానమీ, డెమోగ్రాఫిక్ మేనేజ్మెంట్, టెక్నాలజీ, రీసెర్చ్, ఇన్నోవేషన్ లీడర్స్ ఆఫ్ ఫ్యూచర్, ఎనర్జీ సెక్యూర్ ఇండియా, డెమొక్ర టైజేషన్, డి కార్బనైజేషన్, డిజిటైజేషన్, వాటర్ సెక్యూర్ ఇండియా, వాటర్ క్లైమేట్ చేంజ్ ఎవైలబిలిటీ యాక్సెస్ అనే అంశాల గురించి వివరించారు. కాళహస్తి సత్యనారాయణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2047కి ఏ విధంగా దేశం లోనే నెంబర్ వన్ చేరుతుందో విద్యార్థులకు వివరించారు. తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గుర్రం వీరరాఘవయ్య, విద్యాదాత దాసరి శేషగిరిరావు మాట్లాడారు. అనంతరం డాక్టర్ రామనాథ్ సెమినార్‌లో పాల్గొన్న విద్యా ర్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్‌ను అంద జేశారు. రేపటికోసం డైలీ న్యూస్ ఎడిటర్ డా. శాఖమూరి శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు నర్రా వీరయ్య, మాదాల వెంకటేశ్వర్లు, సొసైటీ సభ్యు లు దాసరి సత్యనారాయణ కళాశాల వైస్ ప్రిన్సి పాల్ కే.ప్రతాప్ కుమార్. ఎన్.సి.సి ఇంచార్జి డాక్టర్. పాతూరి శ్రీనివాస్, నందిపాఠశాల హెచ్‌ఎం పి.రామాంజినేయులు. ఆఫీస్ ఇంచార్జి డి. లక్ష్మీనారాయణపాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

ప్రజాశక్తి - నాదెండ్ల

కుటుంబ కలహాలతో మహిళ గడ్డి మందు తాగి మృతి చెందిన సంఘటన మండలం లోని తూబాడు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై జి.పుల్లారావు వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన కొల్లి పార్వతి (24) తూబాడు గ్రామానికి చెందిన కొల్లి పౌల్ రాజుతో ఆరేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. రెండేళ్ల బాబుకి జ్వరం రావడంతో బిళ్ళలు వేసే విషయంలో భార్యాభర్తలిద్దరూ గురువారం గొడవపడ్డారు. మనస్తాపానికి గురైన పార్వతి ఇంట్లో ఉన్న గడ్డి మందును తాగింది. తెలుసుకున్న భర్త వెంటనే ఆమెను నరస రావుపేటలో ప్రైవేటు వైద్యశాలకు తరలించారు చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మందలించారని కుమార్తె ఆత్మహత్య

ప్రజాశక్తి - పెదకూరపాడు

తండ్రి మందలించాడని కుమార్తె ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కనిగండ్ల గ్రామంలో జరిగింది. కనిగండ్ల గ్రామానికి చెందిన బ్రహ్మానాయుడు తన కుమార్తె తులసిని 17వ తేదీన ఉదయం త్వరగా నిద్ర లేచి పనులు చేసుకోవాలని మందలించారు. అనంతరం భార్యాభర్తలు వ్యవసాయ పనులకు వెళ్లారు. ఇంట్లో ఉన్న తులసి గడ్డి మందుతాగింది. వెంటనే సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి గుంటూరు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు హరికథా కాలక్షేపం

ప్రజాశక్తి తెనాలి

నన్నపనేని సాంబశివరావు భాగవతార్ సంస్మరణ సభ సందర్భంగా స్థానిక కొత్తపేట రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఈనెల 20న మధ్యాహ్నం 3 గంటలకు హరి కథా కాలక్షేపం నిర్వహిస్తున్నట్లు నన్నపనేని వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- తాడేపల్లి

విద్యుత్ లైన్‌ల అత్యవసర మరమ్మతుల నిమిత్తం శని వారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పెనుమాక నుండి ఉండవల్లి గుహలు వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డిసురేష్ బాబు, ఏఈ షణ్ముఖరావు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించి విద్యుత్‌శాఖకు సహకరించాలని కోరారు.

విద్యార్థిని మృతిపై కేసు

ప్రజాశక్తి - దుగ్గిరాల

అనారోగ్య కారణంగా గురువారం మృతి చెందిన స్థానిక దళిత వాడకి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని కొక్కిలిగడ్డ అమూల్య(15) మృతదేహానికి శుక్రవారం మంగళగిరి ఎయిమ్స్ లో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సేకరించిన వివరాల ప్రకారం మృతురాలి తల్లితండ్రులు దాదాపు మూడేళ్ల కిందట విడిపోయారు. అమూల్య, ఆమె తమ్ముడు నాయనమ్మ, తాత గారింట్లో దుగ్గిరాలలోనే ఉంటున్నారు. తల్లి తెనాలి రూరల్ గ్రామం కొలకలూరులో ఉంటోంది. కూతురి మరణ వార్త విని దుగ్గిరాల వచ్చిన తల్లి తన కుమార్తె మరణానికి కారణం ఏమిటని భర్త తరపున వారిని నిలదీసింది. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.



వాటర్ గ్రిడ్ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : విజయపురిసౌత్‌లోని మేకలగొంది నుంచి జల జీవన్ మిషన్ ద్వారా రూ.1200 కోట్లతో మాచర్ల నియోజకవర్గంతో పాటు పల్నాడు ప్రాంతానికి తాగునీటిని అందించేందుకు వాటర్ గ్రిడ్‌ను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో సంబంధిత స్థలాన్ని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు శుక్రవారం పరిశీలించారు. సర్వే మ్యాపులను పరిశీలించారు. అనుమతులన్నీ మంజూరైతే వాటర్ గ్రిడ్ నిర్మాణానికి ముహూర్తం ఖరారు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గురజాల ఆర్డీఓ వి.మురళీకృష్ణ, డిఎఫ్ఓ సందీప్ కుమార్, మాచర్ల తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఇరిగేషన్ ఇఇ రమేష్ పాల్గొన్నారు.



విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల : విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించడానికి వ్యతిరేకించాలని కోరుతూ పట్టణంలోని సుందరయ్య కాలనీలో సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం కరపత్రాలతో ప్రచారం చేశారు. సిపిఎం మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆదాని, అంబానీలకు లాభాలు చేకూర్చే విధంగా వారి కంపెనీలకు స్మార్ట్ మీటర్ల పథకాన్ని ప్రారంభించారని అన్నారు. స్మార్ట్ మీటర్ ఖరీదు రూ.10-17 వేల వరకు ప్రజల నుండి నెలవారి కరెంట్ బిల్లులో అదనంగా కలిపి వసూలు చేస్తారని చెప్పారు. విద్యుత్ వినియోగంలోనూ ప్రజలు ఇబ్బందులు పడనున్నారని, ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు సాయంత్రం 6 గంటల నుంచి పది గంటల వరకు విద్యుత్ వాడితే ఎక్కువ రేటు వసూలు చేస్తారని వివరించారు. ఇప్పటికే కరెంటు చార్జీలు పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతుంటే మూలిగే నక్కపై తాటికాయ పడినట్టుగా అదనపు విద్యుత్ ఛార్జీలు ప్రజలపై వేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయని, అందువల్ల స్మార్ట్ మీటర్లను అందరూ వ్యతిరేకంచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.విజయసారథి, గోవిందు, వెంకటరత్నం, సంపూర్ణ పాల్గొన్నారు.

ఇకపై వాగు పొంగినా వాహనాలు నిలవవు

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని వివిధ గ్రామాలకు రాకపోకలు సాగించడానికి అనువుగా ఉండే గోలి గ్రామ సమీపంలోని వాగుపై లో లెవల్ చప్టా పనులు వారంలో పూర్తవుతాయని ఆర్ అండ్ బి డిఇ రమణయ్య తెలిపారు. పనులను శుక్రవారం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ పిల్లి వాగు, ఏడుమంగళం వాగు, గోలి వాగు నీళ్లన్నీ వచ్చి ఈ వాగులో కలవడం వల్ల ప్రవాహ వేగం అధికంగా ఉంటుందని, అందుకు తగినట్లుగా పనులు చేపట్టామని అన్నారు. దశాబ్దాల నుంచి పెండింగ్లో ఉన్న ఈ చప్టా నిర్మాణానికి 40 లక్షల కేటాయించారని తెలిపారు. అదనంగా ఏడు కానాలను ఏర్పాటు చేశామని, ఇప్పటినుంచి వాగు పొంగినప్పుడల్లా వాహనాలు నిలిచిపోవడం ఉండదని చెప్పారు.







కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం ఆరో రోజుకు చేరింది. సమ్మె శిబిరంలో సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మరో రెండు మూడ్రోజుల్లో సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, జీవో 36 ప్రకారం వేతనాలు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, నిబంధనలు లేకుండా సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమ్మెకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు రమేష్, ప్రతాప్, మధుసూదన్‌రావు, జి.పవన్‌కుమార్, నాగుల్‌మీరా, కె.నాగేశ్వరరావు, రమేష్, కె.శ్రీనివాసరావు, పారిశుధ్య కార్మికులు కె.కొండలు, జి.నాగేశ్వరరావు, కె.సాగర్‌బాబు, కె.మేరమ్మ, మార్తమ్మ, కె.చిన్నవీరమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

మున్సిపల్ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో కార్మికులు మౌన దీక్ష చేపట్టడం ద్వారా తమపట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసించారు.





చెట్లపై అలవోకగా గొడ్డలి వేటు!

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రభుత్వ శాఖల మధ్య పర్యవేక్షణ లోపం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో పర్యావరణానికి శాపమైంది. పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా, కళాకళలాడే ప్రాంతాలు బోసిపోతున్నాయి. విద్యుత్ సరఫరాకు అడ్డంకిగా ఉన్నాయనే కారణంతో పెద్దపెద్ద చెట్లను మరో ఆలోచన లేకుండా నిర్ధాక్షిణ్యంగా నరికేస్తున్నారు. గతంలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న కొమ్మలను మాత్రమే నరికేవారు. ప్రస్తుతం చిన్నాపెద్దా అనే వ్యత్యాసం లేకుండా భారీ చెట్లను సైతం పూర్తిగా నరికిస్తున్నారు. పనిలో పనిగా ప్రకాష్ నగర్ సప్తపది కళ్యాణ మండపం నుంచి సెయింట్ ఆన్స్ పాఠశాలకు వెళ్లే మార్గంలోని ఓ ఇంటి ఎదుట అడ్డంగా ఉందనే సాకుతో సంబంధం లేని చెట్టునూ నరికించడం ప్రకృతి ప్రేమికులను కలచివేసింది. వాల్టా చట్టాన్ని ప్రభుత్వ శాఖలే అతిక్రమిస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి. మొక్కలను నాటాలని, చెట్లను పెంచాలని వనమహోత్సవాలప్పుడు ఫొటోలకు ఫోజులిచ్చే ప్రభుత్వ శాఖల అధికారులు ఇతర సందర్భాల్లో మొక్కలను పెంచడం అటుంచి ఉన్న చెట్లను తొలగించడం ఎందుకనే ప్రశ్నలు వస్తున్నాయి.

అభివృద్ధి, సంక్షేమానికి చంద్రబాబు, టిడిపి బ్రాండ్ అంబాసిడర్లు : హోం మంత్రి

ప్రజాశక్తి - పెదకూరపాడు

అభివృద్ధికి సంక్షేమానికి చంద్రబాబు, టిడిపి బ్రాండ్ అంబాసిడర్ అని రాష్ట్ర హోం మంత్రి వి.అనిత అన్నారు. మండలంలోని ఖమ్మంపాడు గ్రామంలో రూ.3.5 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాల్లో పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌తో కలిసి హోం మంత్రి శుక్రవారం పాల్గొన్నారు. రూ.1.50 కోట్లతో నిర్మించిన జలాలపురం రోడ్డును ప్రారంభించారు. రూ.2 కోట్లతో కంభంపాడు నుండి ఉంగుటూరు వరకు తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ప్రచారం చేశారు. నాయకులు వి.సాంబశివరెడ్డి, పి.నూర్జహాన్, రమేష్, బ్రహ్మయ్య, ఎం.సుబ్బయ్య, ఎ.కృష్ణ, ఎం.వెంకట్రావ్, కె.పద్మ, వై.సురేష్ పాల్గొన్నారు.



అభివృద్ధి లేనప్పుడు మున్సిపాల్టీలో ఎందుకు?

విలీన గ్రామాలను పంచాయతీలుగా పునరుద్ధరించేందుకు కౌన్సిల్ తీర్మానం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

అభివృద్ధి లేమి కారణంగా గ్రామ పంచాయతీలుగానే కొనసాగాలని విలీన గ్రామాలు తీర్మానించినట్లు మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని చెప్పారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం కౌన్సిల్ హాలులో శుక్రవారం ఛైర్మన్ అధ్యక్షతన జరిగింది. విలీన గ్రామాలను మున్సిపాల్టీ నుండి తీసేసే అంశంపై విస్తృతంగా చర్చించారు. గణపవరానికి చెందిన వైస్ ఛైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు చర్చను ప్రారంభిస్తూ ఈ విషయం ఇప్పటికే కోర్టులో ఉండగా మున్సిపాలిటీ ఎలా తీర్మానం చేస్తుందని ప్రశ్నించారు. గ్రామాల్లో నిధుల కొరత కారణంగా తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణ సరిగా లేదని, సిబ్బందికి జీతాలిచ్చే పరిస్థితి కూడా లేదని అన్నారు. మున్సిపాల్టీలో విలీనమైతే ఈ పరిస్థితి మారుతుందని చెప్పారు. 80 శాతం మంది ప్రజలు తమను గెలిపించి విలీనానికి మద్దతు పలికారని, ఇప్పుడు రద్దు చేయాలంటే సరికాదని అన్నారు.

కమిషనర్ పి.శ్రీహరిబాబు స్పందిస్తూ 2020లో రెండు గ్రామాల విషయంలో జరిగిన సందర్భాన్ని వివరించారు. రెండు పంచాయతీలు గ్రామస్తుల సమ్మతితోనే మున్సిపాల్టీలో విలీనం చేసిన తర్వాత కూడా ప్రజలు కోర్టులో కేసు వేయగా విలీనంపై కోర్టు స్టే ఇచ్చిందని చెప్పారు. రాష్ట్రంలో సుమారు 24 మున్సిపాలిటీల్లో విలీన గ్రామాల సమస్యల వల్ల ఎన్నికలు ఆగిపోయాయని, చిలకలూరిపేటలో ఈ సమస్య ఉన్నా ఎన్నికలు జరిగాయని చెప్పారు. టిడిపి కౌన్సిలర్ గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల విలీనం వల్ల గ్రామాల అభివృద్ధి నిలిచిందన్నారు. ఛైర్మన్ రఫాని జోక్యం చేసుకుని పరిశ్రమలన్నీ మూతబడటం వల్ల మున్సిపాల్టీకి ఆదాయం తగ్గిందని, అందుకే విలీన గ్రామాలను పంచాయతీ రాజ్ ద్వారా అభివృద్ధి చేసేందుకు వీలుగా పంచాయతీలుగా పునరుద్ధరించాలని భావిస్తున్నట్లు చెప్పారు.



ఇదిలా ఉండగా ఆక్రమణలపై పదోవార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి ప్రశ్నించారు. కొన్ని ప్రాంతాల్లోనే తొలగిస్తున్నారని, చేతివృత్తుల వారు అధికంగా ఉండే కేబీ రోడ్డులో తొలగించారని అన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ తొలగిస్తామని కమిషనర్ చెప్పారు. తమ వార్డులో కుక్కల బెడద తీవ్రంగా ఉందని 22వ వార్డు కౌన్సిలర్ ప్రమీల చెప్పారు. 370 కుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేయించామని, నాలుగు రోజులకోసారి వీధికుక్కలను తరలింపజేస్తున్నామని ఛైర్మన్ వివరించారు. కుక్కలన్నింటికీ సంతాన నియంత్రణ ఆపరేషన్లు పూర్తి చేయిస్తామన్నారు. అనంతరం ఎజెండాలోని 27 అంశాలను అమోదిస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించి సమావేశాన్ని ముగించారు.



సమావేశంలో కౌన్సిలర్లు... మాట్లాడుతున్న ఛైర్మన్

అభివృద్ధి, అవినీతిపై బహిరంగ చర్చకు సవాల్

చిలకలూరిపేటలో అభివృద్ధి, అవినీతిపై తాను బహిరంగ చర్చకు సిద్ధమని టిడిపి కౌన్సిలర్ గంగ శ్రీనివాసరావు అన్నారు. కౌన్సిల్ సమావేశం అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పసుమర్రు గ్రామం జగనన్న కాలనీలో రూ.కోట్ల కుంభకోణం జరిగిందని, కేసులు పెట్టడంతో ఆ డబ్బును వెనక్కు ఇచ్చారని అన్నారు. బోయపాలెం స్టోన్ క్రషర్ విషయంలోనూ రజిని మనుషులపై కేసులున్నాయని చెప్పారు. మున్సిపాలిటీలో అవినీతికి వైసిపి నాయకులే కారణమని, పలువురు ఉద్యోగాలు కోల్పోవడానికీ వారే బాధ్యులన్నారు.



మంగళగిరి శిబిరంలో మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు



తాడేపల్లిలో కార్మికుల ర్యాలీ

ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె ఉధృతం

ప్రజాశక్తి మంగళగిరి

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు, పారిశుధ్య కార్మికులు, ఇతర కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటి ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి ఆరవ రోజుకు చేరుకుంది. మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాన్ని మంగళగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షేక్ సలీం ఆధ్వర్యంలో సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ షేక్ సలీం, నాయకులు ఆర్ పూర్ణచంద్రరావు, సీనియర్ నాయకులు ఏ వెంకటస్వామి, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బి సామ్యూల్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్ హనుమంతరావు, నియోజకవర్గ మహిళా నాయకురాలు షేక్ మున్ని, జి జాన్ బాబు లు మాట్లాడుతూ న్యాయమైన మున్సిపల్ కార్మికుల కోరికలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నో సంవత్సరం నుండి కాంట్రాక్ట్ వర్కర్లుగా పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని అన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని విడి వెంటనే మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చంగయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించేంతవరకు సమ్మె చేస్తామని అన్నారు. పట్టణాలను, నగరాలను శుభ్రంగా ఉంచుతున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా వారి పేరుతో ఉన్నతాధికారులు అవార్డులు తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. పట్టణాలు, నగరాలు సుభ్రంముగా ఉంచడంలో మున్సిపల్ కార్మికులు ఎనలేని కషి చేస్తున్నారని అన్నారు. అధికారులు మాత్రం వారి సమస్యలను పరిష్కరించే స్థితిలో లేరని విమర్శించారు. ఆరు రోజులు గడుస్తున్న ఇంతవరకు పట్టించుకోవడంలేదని అన్నారు. న్యాయమైన వారి కోరికలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి మంగళగిరి పట్టణంలో భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. హాస్పటల్ రోడ్డు, దేవస్థానం మీదగ మెయిన్ బజార్, సాదు సోడా సెంటర్, పూల మార్కెట్ సెంటర్, మిద్ది సెంటర్, హుస్సేన్ కట్టమీదగా గౌతమ్ బుద్ధ రోడ్డు చేరుకొని అక్కడ నుండి కార్పొరేషన్ కార్యాలయం వరకు భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం బాలాజీ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కే శ్రీనివాసరావు, ఎం శ్రీనివాసరావు, వి శ్రీనివాసరావు, కేదార్నాథ్, పి రాము, వై శివ నాగేశ్వరరావు, కే వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.



ఎర్రబాలెంలో





తెనాలిలో



ఎర్రబాలెం సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మునిసిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను సానుకూల దక్పథంతో ప్రభుత్వం పరిష్కరించాలని ఎర్రబాలెం ఇండస్ట్రీయల్ పార్క్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ రామరాజు కోరారు. శుక్రవారం ఉదయం యర్రబాలెంగ్రామంలో సీఐటీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న మునిసిపల్ కార్మికుల సమ్మె శిబిరం సందర్శించి మద్దతు తెలియచేశారు. కార్మికులని ఉద్దేశించి రామరాజు మాట్లాడుతూ చిన్న ఉద్యోగులు ఐన పారిశుధ్య కార్మికుల కుటుంబాలకి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయవలసిన అవసరం ఉందన్నారు. మిగిలిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వలే వీరి రిటైర్మెంట్ వయసుని 62 సంవత్సరాలుకి పెంచాలని అన్నారు. సిపిఎం యర్ర బాలెం గ్రామ శాఖ కార్యదర్శి అత్తలూరి వీరవెంకయ్య మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులకి సిపిఎం సంపూర్ణ మద్దతు ఎల్లపుడు ఉంటుందన్నారు. అభ్యుదయ కార్మిక సంఘం నాయకులు ఆర్ సాంబశివరావు మాట్లాడుతూ కార్మికులు అందరు ఐక్యత తో ముందుకు వెళితే విజయం తథ్యం అన్నారు. కార్యక్రమం లో సీఐటీయూ డివిజన్ అధ్యక్షులు ఎం రవి, సీఐటీయూ నాయకులు రామారావు, బాబు, ఆదిలక్ష్మి, కోటేశ్వరమ్మ, దివ్య, సుభాని, కరీముల్లా శివకోటి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఎర్రబాలెం మున్సిపల్ కార్మికుల చేపట్టిన సమ్మె శిబిరాన్ని శుక్రవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వర రావు సందర్శించి మాట్లాడారు. కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం గా వ్యవహరించడం కాలయాపన చేయడం వల్లనే గత్యంతరం లేని పరిస్థితుల్లో మున్సిపల్ కార్మికులు సమ్మె బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు సహృదయంతో అర్థం చేసుకోవాలని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం మాని సమ్మె వలన రాష్ట్ర ప్రజలు అనారోగ్యాలు పాలు కాకముందే మేల్కొని తక్షణం సమ్మె పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 26 ప్రకారం మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు జరుపుతామని చెప్పి తీరా తల్లికి వందనం మున్సిపల్ కార్మికుల్లో ఒక్కరికి కూడా వర్తింప చేయలేదని అన్నారు. మున్సిపల్ కార్మికుల పిల్లలకు సంక్షేమ పథకాలను అమలు జరపాలని ఆయన కోరారు. గతసమ్మె కాలపు ఒప్పందాలకు ఇవ్వాల్సిన జీవోలను ఇవ్వకుండా ప్రభుత్వం కావాలనే కాలయాపన చేస్తుందని అన్నారు. తక్షణం జీవోలను ఇవ్వాలని ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ⌊ మున్సిపల్ కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం ఉదాసీనంగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏంటీఎంసి రాజధాని ప్రాంత మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు ఎం రవి ,పలువురు మున్సిపల్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- తాడేపల్లి

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని, మున్సిపల్ కార్మికులు తాడేపల్లి లో ప్రదర్శన నిర్వహించారు. సమ్మె మూడో రోజు అయినా శుక్రవారం మున్సిపల్ జోనల్ కార్యాలయం నుండి కార్మికులు ప్యారి కంపెనీ గేటు మీదగా బోసు బొమ్మ సెంటర్, మేక అమర రెడ్డి భవనం వరకు ప్రదర్శన నిర్వహించారు. గత ప్రభుత్వం విడుదల చేస్తున్న జీవోలను అమలు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం మేక అమరా రెడ్డి భవనంలో పి కృష్ణ అధ్యక్షతన సిఐటియు నాయకులు వేముల దుర్గారావు సిఐటియు విశిష్టత గురించి కార్మికులకు వివరించారు. దుర్గారావు మాట్లాడుతూ 1970లో సిఐటి ఆవిర్భవించిన దగ్గర నుండి నేటి వరకు సిఐటియు చేపట్టిన అనేక పోరాటాలను సోదాహరణంగా తెలిపారు. 1974 లోనే తాడేపల్లిలో రైల్వే సమ్మెను జయప్రదం చేసిన తీరును ఆయన వివరించారు. కనిపిస్తే సిఐటియు నాయకులు కాల్చిపడేమని ఆర్డర్ ఉన్నా ఎమర్జెన్సీ రోజుల్లోనే సిఐటియు నాయకులు మేక అమరారెడ్డి తన అనుచరులతోటి ఈ ప్రాంతంలో కార్మిక ఉద్యమాన్ని నిర్మించారు. ఈ కాలంలో సిఐటియు వివిధ రంగాల ఉద్యోగుల హక్కుల కోసం ఏవిధంగా పోరాడింది ఆయన వివరించారు. అంగన్వాడీ పోరాటాన్ని ఆశా పోరాటాన్ని భవనిర్మాణ కార్మికుల పోరాటం సందర్భంగా ఆటో ముఠా కార్మికుల సమస్యల పైన సిఐటియు నిరంతరం పనిచేస్తుందని ఆయన చెప్పారు. తాడేపల్లి ముగ్గురోడ్లో పని ఒత్తిడి వల్ల ఆశా కార్యకర్త చనిపోతే, కుటుంబానికి ప్రభుత్వం నుండి రూ 10 లక్షల నష్టపరిహారం ఇప్పించిన సంగతిని గుర్తు చేశారు. ఎసిసి కార్మికుల సమస్యపై వారి పోరాటానికి అండగా ఉండి నిరంతరం సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, డి వెంకట్ రెడ్డి, వేణు, డేవిడ్,రంగమ్మ, కొండయ్య, కామాక్షి,లక్ష్మీ, పాల్గొన్నారు.

ప్రజాశక్తి తెనాలి

మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. సమ్మెకు మద్దతు తెలిపిన సిఐటియు జిల్లా కార్యదర్శి కె బాబు ప్రసాద్ శుక్రవారం సమ్మె శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల ఒకటిన డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కు రాష్ట్ర యూనియన్ నాయకులు సమ్మె నోటీసును ఇచ్చారని తెలిపారు. 2018 లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల ఉద్యోగాలు పర్మినెంటు చేసి, వారికి సమాన పనికి సమాన వేతనం చెల్లించే విధంగా లిఖితపూర్వకంగా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ అప్పటి ప్రభుత్వం దానిని అమలు చేయలేదని అన్నారు. కనీసం 2024 లో ఇచ్చిన జీవో నెంబర్ 36 ద్వారా కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్న కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపివేశారని, వాటిని కూడా వర్తింప చేయాలని కోరారు. ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి షేక్ హుస్సేన్ వలి మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే సమ్మెను ఉదతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిఎస్ కిరణ్ కుమార్, డి శ్రీధర్, పి. చక్ర వర్తి, జి. గోపి, సిహెచ్ దిలీప్ కుమార్, షేక్ కరిముల్లా, ఎం. ప్రదీప్ కుమార్, వై అశోక్, కె. ప్రశాంతి, ఎం సునీల్ కుమార్, ఖాసిం పాల్గొన్నారు.

వర్సిటీ డిప్లమో ఫొటోగ్రఫీ విద్యార్థికి అమెరికా పురస్కారం

ప్రజాశక్తి - ఎఎన్‌యు



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో నడుస్తున్న డిప్లమో ఇన్ ఫోటోగ్రఫీ కోర్సు విద్యార్థి పొలిబోయిన కృష్ణమూర్తికి ఫోటోగ్రఫీ రంగంలో అమెరికన్ పురస్కారం లభించింది. ప్రపంచంలో పేరు గాంచిన ఇమేజ్ కొలీగ్ సొసైటీ యుఎస్ఏ సంస్థ ప్రతీ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా వివిధ అంశాలపై ప్రతిభ చూపిన ఫోటోగ్రాఫర్ లకు ఈ పురస్కారాలు అందజేస్తుంది. ఈ ఏడాది మార్చి నెలలో ఫోటోగ్రఫీ విద్యార్థి కృష్ణమూర్తి ఒరిస్సా లోని అతిమారుమూల కొండకోనల్లో నివశించే బోండ గిరిజనుల జీవనశైలిపై పంపిన 12 చిత్రాలను న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారు ఈ మేరకు సంస్థ ఛైర్మన్ టోనీలీ బుధవారం మెయిల్ పంపించారు. ఈ మేరకు శుక్రవారం వర్సిటీలో కృష్ణమూర్తిని వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంలతో పాటు జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ జ్యోతిర్మయి అభినందించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రాష్ట్రవ్యాప్తంగా 27వ ర్యాంక్

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టేందుకు సహకరించాలి : కమిషనర్

ప్రజాశక్తి - తెనాలి

స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 లో తెనాలి పురపాలక సంఘానికి రాష్ట్ర స్థాయిలో 27, జాతీయస్థాయిలో 540 ర్యాంక్ లభించినట్లు మున్సిపల్ కమిషనర్ వి లక్ష్మీపతిరావు చెప్పారు. పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2024 లో ఓడిఎఫ్ కింద రాష్ట్రస్థాయిలో ర్యాంకు లభించగా, జాతీయస్థాయిలో ప్లస్ ప్లస్ క్యాటగిరిలో ఉన్నామని, అదేవిధంగా గార్బేజ్ కలెక్షన్ లో స్టార్ రేటింగ్ లో ఉన్నట్లు చెప్పారు. పురపాలక సంఘం గ్రీన్ తెనాలిగా ఉండేందుకు ప్రజల సహకారం అవసరమన్నారు. అలాగే ప్రతి నెల మూడవ శనివారం ప్రత్యేక నినాదంతో పర్యావరణ పరిరక్షణకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, దానిలో భాగంగా శనివారం ప్లాస్టిక్ నియంత్రణకు 'అంతులేని కాలుష్యం' పేరిట పట్టణంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు ర్యాలీలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, చైర్ పర్సన్ తాడి బోయిన రాధిక, సబ్ కలెక్టర్ సంజన సింహ, తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ పాల్గొంటారని తెలిపారు.

స్వచ్ఛ రథాన్ని పరిశీలించిన కృష్ణతేజ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు రురల్ మండలంలోని పైలట్ ప్రాజెక్ట్‌గా నిర్వహిస్తున్న స్వచ్ఛ రథం కార్యక్రమం 7వ రోజు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఎం.కృష్ణతేజ, అడిషనల్ కమిషనర్ సుధాకర్ శుక్రవారం వెంగళాయపాలెంను గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ కృష్ణతేజ స్వచ్ఛరథం పని తీరును పరిశీలించారు. ఘన వ్యర్థాలు విక్రయించి నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసిన ప్రజలతో మాట్లాడారు. సర్పంచ్, అధికారుల్ని ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామాల ఆదాయం పెంపుదలకు చర్యలు తీసుకోవాలని, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

లైబ్రేరియన్‌కు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక కొత్తపేట మహిళ బాలల గ్రంధాలయంలో లైబ్రేరియన్ గా విధులు నిర్వర్తిస్తూ పెదరావూరు శాఖకు బదిలీపై వెళ్తున్న కొండూరి అంజనీకు పలువురు ఆత్మీయ వీడ్కోలు పలికారు. కొత్తపేట గ్రంధాలయ శాఖలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో తెనాలి తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ పాల్గొన్నారు. గత ఆరేళ్లుగా ఇదే శాఖలో విధుల్లో ఉన్న అంజలి విధి నిర్వహణలో సుమారు 14 మంది యువ పాఠకులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో కొలువు సాధించారు. తహశీల్దార్ గోపాలకృష్ణ ఆమెను సత్కరించి వీడ్కోలు పలికారు. మహిళ బాలల గ్రంధాలయంలో ఆమె అందించిన సేవలను ఎమ్మార్వో కొనియాడారు. అంజలి స్థానంలో కొలకలూరు గ్రంధాలయ శాఖ నుంచి కె సుజాత కొత్తపేట శాఖకు బదిలీపై వచ్చారు.

పోలింగ్ కేంద్రాల్లో అధికారుల పరిశీలన

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

పొలింగ్ బూత్‌ల్లో ఎన్నికల సంఘం సూచించిన అన్ని ఏర్పాట్లు ఖచ్చితంగా ఉండాలని స్థానిక అధికారులు, ఎన్నికల సహాయ అధికారులను ఆర్‌ఓ బి గాయత్రిదేవి ఆదేశించారు. తహశీల్దార్ బి. కిరణ్‌కుమార్, కమిషనర్ డి వేణుబాబుతో కలిసి పట్టణంలోని 53, 55 పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. అనంతరం పలు సూచనలు చేశారు. ఆమె వెంట స్థానిక అధికారులు, సిబ్బంది పలువురు రాజకీయ పార్టీల బూత్ ఏజెంట్లు ఉన్నారు.

క్లీన్ మాచర్లకు సహకరించండి

మున్సిపల్ కమిషనర్ వేణుబాబు

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల టౌన్‌ని క్లీన్ మాచర్లగా చేసేందుకు శానిటరి వర్కర్స్ బాధ్యతగా పని చేయాలని మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు సూచించారు. శుక్రవారం శానిటరీ కార్యాలయం వద్ద వర్కర్స్‌తో ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి నుండి నూరు శాతం వ్యర్థాలను సేకరించాలన్నారు. ప్రధాన రహదారులతో పాటు ఆయా వీధుల్లో ఉండే డ్రెయినేజిల క్లీనింగ్, రహదారుల వెంట ఉండే చెత్త చెదారాన్ని ఎప్పటికప్పడు తొలగించాలన్నారు. సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదం అమలుపై కార్యాలయ సిబ్బందికి సహకరించాలని ఆదేశించారు.

మద్దతు ధర లేక నష్టపోతున్న రైతులు

మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ప్రజాశక్తి - వినుకొండ

పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించకుండా కూటమి ప్రభుత్వం రైతాంగానికి అన్యాయం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు విమర్శించారు. నియోజకవర్గంలోని ఈపూరు, బొల్లాపల్లి, నూజెండ్ల మండలాల రైతులు శుక్రవారం తనను కలిసి పంట గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నామని తెలిపారన్నారు. బ్రహ్మనాయుడు మాట్లాడుతూ పెట్టుబడులు పెట్టి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వినుకొండకు మంజూరైన వంద పడకల ఆసుపత్రి పనులు మొదలుపెట్టి నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న రామకృష్ణ

సొసైటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణ

ప్రజాశక్తి - కారంపూడి

కారంపూడి మండల సొసైటీ అధ్యక్షునిగా టీడీపీ బీసీ నాయకులు నాగరపు రామకృష్ణ శుక్రవారం మండల టీడీపీ ముఖ్యనేతల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రైతుల ప్రయోజనం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, రైతులకు పంట, పెట్టుబడి ఇతర అవసరాలకు తమ సొసైటీ ద్వారా చిన్న, సన్నకారు రైతు లకు రుణాలు అందేలా కృషి చేస్తానని అన్నారు. ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, మండల టీడీపీ మాజీ అధ్యక్షులు చప్పిడి రాము, మాజీ ఎంపీపి నాగుల్‌నాయక్, కారంపూడి పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షులు కటికల బాలకృష్ణ, టీడీపీ మైనారిటీ నాయకులు తండా మస్తాన్ జానీ పాల్గొని రామకృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు.

అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

వయోజన విద్య ఉపసంచాలకులు ఆంజనేయులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి విజయ వంతం చేయాలని వయోజన విద్యాశాఖ ఉపసంచాలకులు ఆంజనేయులు కోరారు. శుక్రవారం కలెక్టర్ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) లోఅక్షర ఆంధ్ర కార్యక్రమంపై జిల్లాస్థాయి అధికారులకు కన్వర్జెన్సీ మీటింగ్ నిర్వహించారు. వయోజన విద్య ఉపసంచాలకులు మాట్లాడుతూ జిల్లాలోని నిరక్షరాస్యులైన మహిళలు, పురుషులకు అక్షర ఆంధ్రలో భాగంగా చదువు నేర్పించే కార్యక్రమాన్ని (చదవడం, రాయడం, చిన్నచిన్న లెక్కలు చేయడం) జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పిడి ఝాన్సీ రాణి, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ తరపున (వీరస్వామి, డిపిఎం), ఐసిడిఎస్ పిడి తరపున అరుణ, డిపిఓ, డీఈవో చంద్రకళ, డి.పి. ఆర్ఓజి ఎస్‌డబ్ల్యూ. ఎస్. వెంకట్ రెడ్డి, డిఎంహెచ్ఓ. రవి, డ్వామా పిడి సహకారంతో విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో పల్నాడుజిల్లా వయోజన విద్య ఉప సంచాలకులు కే. ఆంజనేయులు మాట్లాడుతూ పల్నాడు జిల్లాకు అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా 1,27565 మందిని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం టార్గెట్‌గా ఇచ్చిందనీ, దీన్ని విజయవంతం చేసేందుకు సహకరించాలని ఆయా శాఖల అధికారులను కోరారు. అందరి సహకారంతో ఆగస్టు 7న అక్షరాస్యత కేంద్రాలు ప్రారంభించి మార్చిలో నిర్వహించే ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞాన మదింపు పరీక్షా నిర్వహణకు తమ సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలన్నారు. వయోజన విద్యాశాఖ తరపున నిరక్షరాస్యులైన ప్రతి ఒక్కరికి రెండు వాచకాలు, వర్క్ షీట్లు, దశ్య శ్రవణ వీడియోలు ఉచితంగా అందిస్తామన్నారు. వాలంటీర్లను ఎంపిక చేసి నిరక్షరాస్య మహిళలను మ్యాచింగ్ బ్యాచింగ్ చేసి అనగా ఒక వాలంటీర్‌కు పది మంది నిరక్షరాస్యులను జత చేసి జూలై 26వ తారీకులోగా సమగ్రంగా నివేదికలు అందజేయాలని ఆంజనేయులు అధికారులను కోరారు.

నాగిరెడ్డిపాలెం చెరువులో నీటి మోటార్లు ప్రారంభం



స్విచ్ ఆన్ చేస్తున్న వెన్న సీతారామిరెడ్డి, డిఇ, కాంట్రాక్టర్

ప్రజాశక్తి - బెల్లంకొండ

గత పాలక ప్రభుత్వంలో గ్రామాల్లో అభివృద్ధి శూన్యంగా మారి, కనీసం దాహం తీర్చేందుకు మంచినీటిని సరఫరా చేయడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని మండల టిడిపి సీనియర్ నాయకులు వెన్న సీతా రామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నాగిరెడ్డి పాలెం నాగమ్మచెరువులో పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు నూతన విద్యుత్ మోటార్లను అమర్చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఈ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నాగిరెడ్డి పాలెంలోని నాగమ్మ చెరువు నుండి బెల్లంకొండ, రాజుపాలెం మండలాల్లోని 13గ్రామాలకు రోజూ 13 లక్షల క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారన్నారు. వెన్న సీతారామిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లోని నీటి సరఫరా కోసం అవసరమైన సామగ్రి, విద్యుత్ మోటర్‌లో స్థానిక శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ చొరవతో రూ.2 లక్షల 50 వేలతో కొత్త విద్యుత్ మోటార్లను అమర్చి గ్రామాల్లో ఇంటింటికి నీటి సరఫరా చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. మంచినీటి చెరువులో నీటిని శుభ్రపరిచి గ్రామాల్లోని ప్రజలకు మంచినీరు అందించాలని సిబ్బందికి సలహాలు, సూచనలు అందించారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లను డిఈ శ్రీనివాసరావు, వెన్న సీతారామిరెడ్డి, కాంట్రాక్టర్ కృష్ణమూర్తి పూజ నిర్వహించి, విద్యుత్ మోటర్‌ను స్విచ్ ఆన్ చేశారు. కార్యక్రమంలో ఏఈ మల్లికార్జునరావు, సిబ్బంది కొండలు, అంకమ్మరావు, బాబు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

మినుములు, కంది విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఆహార భద్రత పథకం కింద రాయితీపై మినుములు కంది విత్తనాలు పంపిణీ చేశారు. సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామంలో పల్నా జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వ హించారు. పల్నాడు జిల్లా రైతు శిక్షణా కేంద్రం డిడిఏ ఎం. శివకుమారి మాట్లాడుతూ ఆఖరి దుక్కిలో ఫాస్ఫరస్ ఎరువులు వేసుకోవాలని సూచించారు, వేరు వ్యవస్థ బాగా అభివృద్ధి చెంది ఆరోగ్యవంతమైన పంటను సాగు చేయవచ్చునని తెలిపారు. జీవన ఎరువులైన ఫాస్ఫరస్ సాలుబులైజింగ్ బాక్టీరియా, అజోల్లా, వామ్ జీవన ఎరువులు వాడుకొని రసాయనిక ఎరువుల వాడకం తగ్గించుకోవాలని సూచించారు. వరి పంటను సాగు చేసే రైతులు వరి విత్తనాలు నారుమడిలో చల్లుకునే ముందు శిలీంద్ర నాశిని కార్బెండిజం 3గ్రా కిలో వరి విత్తనాలను విత్తన శుద్ధి చేసు కోవాలని సూచించారు. పల్నాడు జిల్లా రైతు శిక్షణా కేంద్రం వ్యవసాయ అధికారిణి ఎం. అరుణ మాట్లాడారు. అనంతరం జాతీయ ఆహార భద్రతా పథకం కింద 100శాతం సబ్సిడీ ద్వారా ప్రభుత్వం అందజేసిన మిను ములు, కంది విత్తనాల చిరుసంచులు కొంత మంది రైతు లకు అందజేశారు. సత్తెనపల్లి మండల వ్యవసాయాధికారి బి. సుబ్బారెడ్డి, గుడిపూడి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలపై శ్రద్ధ పెట్టండి

ప్రజాశక్తి - మాచర్ల

విద్యుత్ బకాయిలు సకాలంలో చెల్లించి విద్యుత్ సంస్థకు సహకరించాలని వినియోగదారులకు విద్యుత్ శాఖ ఎస్ఇ డాక్టరు పి. విజయ్‌కుమార్ సూచించారు. స్థానిక డిఇ కార్యాలయంలో శుక్రవారం ఉదయం మాచర్ల డివిజన్ పరిధిలోని అధికారులతో ఆయన పలు అంశాలపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఎస్ఇ డాక్టరు పి విజయ్‌కుమార్ మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి బకాయిలపై అధికారులు దృష్టి పెట్టి వసూళ్ళు పెంచాలన్నారు. పిఎం సూర్య ఘర్ పథకంపై వినియోగదారులకు అవగాహన కల్పించి ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేయించి విద్యుత్ ఉత్పత్తి పెంపుకు కృషి చేయాలన్నారు. అగ్రికల్చర్ వర్క్స్, ఆర్‌డిఎస్ఎస్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమీక్ష సమావేశంలో సీనియర్ ఎకౌంట్స్ అధికారి బి వెంకటేశ్వరరావు, ఇఇ సింగయ్య, సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖ ఇంజనీర్స్ పాల్గొన్నారు.

ఒత్తిడి, ఆందోళనకు గురికావొద్దు

డాక్టర్ గంగూరి సుప్రజ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ఒత్తిడి, ఆందోళనకు మనిషి గురికాకుంటే మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉం టుందని సుప్రజ హాస్పిటల్ అధినేత్రి డాక్టర్ గంగూరి సుప్రజ అన్నారు. ప్రజాశక్తితో ఆమె ప్రత్యేకంగా మాట్లాడుతూ పల్నాడు ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అం దించాలనే లక్ష్యంతో నరసరావుపేట పట్టణంలో పల్నాడు రోడ్డులో హాస్పిటల్ స్థాపించి అనతికాలంలోనే పల్నాడు ప్రజల ఆదరాభిమానాలు సంపాదించామన్నారు. తమ హాస్పిటల్‌లో బి.పి, షుగర్, థైరాయిడ్, మలేరియా, టైఫా యిడ్, డెంగ్యూ, విషజ్వరాలు, పాము, తేలుకాటు, పాయిజన్ కేసులు, గుండెజబ్బులు, ఊపిరితిత్తుల సమస్యలు, గ్యాస్, లివర్, నరాల సమస్యలు, కిడ్నీ వ్యాధులతో మహిళలకు సంబంధించిన వ్యాధులకు ప్రత్యేక వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. మనిషి శారీరకంగా ఎంత దృఢంగా ఉన్నా మానసిక ఒత్తిడికి గురైతే ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. ఒంటరితనం, ఒత్తిడి, భయం, నిస్సాహయత, నిస్పృహ, అసంతప్తి, నిద్రలేమి మానసిక రుగ్మతలకు కారణమని పరిశోధ నలు వెల్లడిస్తు న్నాయన్నారు. మద్యపానం, ధూమపానాలకు దూరంగా ఉండాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం, ధ్యానం, నడక, వ్యాయామం చేయడం ద్వారా వ్యాధుల నుండి తప్పించుకోవచ్చన్నారు. తమ హాస్పిటల్ ఆధ్వ ర్యంలో గ్రామీణ ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని రానున్న రోజులలో ఉచిత వైద్య శిబిరాలను విస్తృతపరుస్తామని తెలిపారు.



కరీముల్లాను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, ఇతరులు

ఎమ్మెల్యేను కలిసిన యార్డు నూతన ఛైర్మన్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట మార్కెట్ యార్డ్ కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికైన షేక్ కరీముల్లా (టీడీపీ కరీముల్లా) శుక్రవారం నియోజకవర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఛైర్మన్‌గా ఎన్నికైన కరీముల్లాని ప్రత్తిపాటి పుల్లారావు, వివిధ హోదాల్లోని నాయకులు అభినందించారు. కరీముల్లా మాట్లాడుతూ నాకు ఈ పదవి రావడానికి కృషి చేసిన ప్రత్తిపాటి పుల్లారావుకి కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు మానం వెంకటేశ్వర్లు, నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్, గుర్రం నాగపూర్ణా చంద్రరావు, కందుల రమణ, మద్దిరాల సుబ్బారావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పుల్లారావును కలిసిన న్యాయవాదులు

స్థల కేటాయింపుపై లాయర్ల హర్షం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కోర్టు భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించినందుకు స్థానిక న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. చిలకలూరిపేట నుండి నరసరావుపేట వెళ్ళు దారిలో గంగమ్మ గుడి వద్ద 91 సెంట్ల స్థలాన్ని నూతన కోర్టు భవన సముదాయ నిర్మానానికి కేటాయించారు. శుక్రవారం న్యాయవాదులు శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావును మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. చిలకలూరిపేట కమిషనర్, చిలకలూరిపేట తహశీల్దార్, చిలకలూరిపేట మున్సిపల్ ఛైర్మన్ కౌన్సిల్ సభ్యులకు న్యాయవాదుల, న్యాయవాద గుమస్తాల సంఘాలు ధన్యవాదాలు తెలిపాయి.



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మినారాయణ

ఎమ్మెల్యేకు జనం నుండి అర్జీలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే పరిష్కారవేదిక నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కన్నా లక్ష్మి నారాయణ అన్నారు. శుక్రవారం సత్తెనపల్లి పట్టణంలో ఎమ్మెల్యే కార్యాలయంలో సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను ఎమ్మెల్యే స్వీకరించారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. సమస్యలను తక్షణ పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై నేడు ర్యాలీ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ చిలకలూరిపేట కార్యక్రమాలలో భాగంగా స్థానిక పురపాలక సంఘం ప్లాస్టిక్ వాడకం నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శనివారం పుర పాలక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహి సున్నట్లు కమిషనర్ పి.శ్రీహరిబాబు తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ర్యాలీ ఉదయం 10 గంటలకు మద్దిమల్లయ వీధిలోని రామాలయ గుడి (పాత టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కార్యాలయం) వద్ద ప్రారంభమై మార్కెట్ వరకు కొనసాగు తుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు హాజరవుతాని తెలిపారు. ఛైర్‌పర్సన్ షేక్ రఫానీ, వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వామపక్ష నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

ప్రజాశక్తి - మంగళగిరి

ఆదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించడానికి ఇళ్ల వద్దకు వస్తే అడ్డుకోవాలని వామపక్ష నాయకులు ప్రజలకు పిలుపు నిచ్చారు. శుక్రవారం సిపిఐ కార్యాలయంలో సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ పార్టీల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సిపిఐ పట్టణ కార్యదర్శి ఏ. ప్రభాకర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో వామపక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వలన విద్యుత్ వినియోగదారులకు తీరని నష్టం జరుగుతుందని అన్నారు. ప్రీపెయిడ్ మీటర్‌తో విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం పడుతుందని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి నాయకులు ఎన్నికలకు ముందు స్మార్ట్‌మీటర్లు బిగిస్తే పగలగొట్టాలని పిలుపునిచ్చి ఇపుడు అదే నాయకులు వాటిని బిగించడానికి పూనుకున్నారని విమర్శించారు. సమావేశంలో ఈనెల 22వ తేదీన సిపిఎం కార్యాలయంలో విద్యుత్ వినియోగదారులతో సదస్సు జరపాలని, 26వ తేదీ నుండి ఆగస్టు 7వ తేదీ వరకు ఇంటింటికి వెళ్లి సంతకాల సేకరణ చేయాలని, అర్జీలు పెట్టించాలని నిర్ణయించి నట్లుగా నాయకులు తెలిపారు. ఆగస్టు 7వ తేదీన స్మార్ట్ మీటర్లు వ్యతిరేకిస్తూ మంగళగిరిలో విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా చేయాలని, మిద్ది సెంటర్ నుండి విద్యుత్ కార్యా లయం వరకు ర్యాలీ నిర్వహించాలని సమావేశం నిర్ణయిం చినట్లు తెలిపారు. సమావేశంలో సిపిఎం సీనియర్ నాయ కులు జె.వి.రాఘవులు, సిపిఎం పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్, సిపిఎం సీనియర్ నాయకులు పి బాలకృష్ణ, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సిపిఐ నాయకులు బి.మోహన్ రావు, పి నాగేశ్వరరావు, నందం బ్రహ్మేశ్వరావు, సిపిఐ ఎమ్మెల్యే నాయకులు కే.కోటేశ్వరరావు, అభ్యుదయ వాది ఆర్.సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి మంగళగిరి

విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించడానికి ఇళ్లకు వస్తే విద్యుత్ వినియోగదారులు ప్రతిఘటించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. శుక్రవారం సాయంత్రం మంగళగిరి సిపిఎం కార్యాలయంలో సిపిఎం పట్టణ విస్తృత సమావేశం నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో రామారావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ విద్యుత్ ఒప్పందాలను ఆదాని కి అప్పగించడానికి జరిగిన కుట్రలో భాగమే స్మార్ట్ మీటర్లు అన్నారు. దీనివలన విద్యుత్ భారం వినియోగదారులపై పడుతుందని అన్నారు. పేదలకు వెంటనే రీఛార్జ్ చేసుకునే అవకాశం ఉండదని అన్నారు. దళితులకు, గిరిజనులకు, రైతులకు ఉచితంగా ఇచ్చే కరెంటు పోతుందని తెలిపారు. స్మార్ట్ మీటర్లు ఉచితమని చెబుతారని, కానీ 10,000కు పైగా చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. దీన్ని నెలల వారీగా బిల్లులు వేసి వసూలు చేస్తారని అన్నారు. ఎక్కువగా వాడుకునే సమయాన్నిబట్టి బిల్లులు ఎక్కువగా బిల్లు చేస్తారని అన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుండి ఆగస్టు 5వ తేదీ వరకు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్ల పై దాని వలన విద్యుత్ వినియోగదారులకు కలిగే నష్టాలను ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. పట్నంలో వివిధ రకాలలో ప్రభుత్వ భూముల్లో ఇల్లు వేసుకొని నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని అన్నారు. సిపిఎం గుంటూరు జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు, పారిశుధ్య కార్మికులు, వివిధ రకాల కార్మికులు చేస్తున్న సమ్మెను సిపిఎం బలపరుస్తోందని అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాలాజీ, వై కమలాకర్, పట్టణ కమిటీ సభ్యులు ఎస్ గణేష్, ఏం చలపతిరావు, వి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండంలోని చిలువూరు గ్రామంలో స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని వ్యతిరేకించాలని కోరుతూ కరపత్రాలు పంచి ప్రచారం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు మాట్లాడుతూ అదానీ కంపెనీ స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తున్నారని, ప్రజలు జాగ్రత్త గా ఉండాలని స్మార్ట్ మీటర్ బిగించడం వలన భవిష్యత్తులో పేదలపై విద్యుత్‌భారాలు పడతాయని ఆదానీలాంటి బడా కంపెనీల చేతిలోకి మన విద్యుత్ సంస్థలు వెళ్లబోతున్నాయని అన్నారు. ఈ మీటర్లకు సెల్‌ఫోన్ పద్ధతిలో ముందుగానే డబ్బు చెల్లించి చార్జింగ్ చేయించుకోవాలన్నారు. ఇంటికి వచ్చి రీడింగ్ తీసే పరిస్థితి ఉండదనీ, బిల్లులు ఆన్‌లైన్ పద్ధతిలోనే వస్తాయనీ, ప్రైవేట్ కంపెనీ రీడింగ్ తీస్తుందనీ, మనకి ఎంత వస్తుందనే సమాధానం చెప్పే వారే ఉండరని అన్నారు. మీటరుకు అయ్యే ఖర్చు రూ.10 నుండి 17వేల వరకు ఉంటుందని తెలిపారు. 93 నెలల్లో మీటరు అద్దె పేరుతో మన వద్దే ఈ డబ్బు మొత్తం నెలవారి వాయిదాలతో వసూలు చేస్తారన్నారు. రాష్ట్రంలో రెండు కోట్ల మీటర్లు ఆదానీ కంపెనీకి కాంట్రాక్టు ఇచ్చారని చెప్పారు. ఎం.కోటేశ్వరావు కే.బిక్షాలు కామేశ్వరరావు, బి. దిబ్బ రాజు కే.శ్రీరాములు కే.ధర్మారావు, బి.రాజు, కే.ప్రేమయ్యా, పి.నాగేశ్వరావు, శ్యాంబాబు పాల్గొన్నారు.



దుగ్గిరాలలో కరపత్రాలు పంచుతూ...

ప్రజాశక్తి - పెదకాకాని

ప్రజలు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించకుంటే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. మండల కేంద్రమైన పెదకాకానిలోని సుందరయ్య కాలనీ సిఐటియు కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్మార్ట్ విద్యుత్ మీటర్లకు వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది రైతు కూలి సంఘం సహాయ కార్యదర్శి దానబోయిన భాస్కరరావు అధ్యక్షత వహించారు. పుప్పాల సత్యనారాయణ, నన్నపనేని శివాజీ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వలన విద్యుత్ వినియోగదారులకు తీరని నష్టం జరుగుతుందని అన్నారు. ఇప్పటికే ప్రజలు సర్దుబాటు చార్జీలతో ఇబ్బందులకు గురి అవుతుంటే ఆదానీ స్మార్ట్ మీటర్ బిగించి విద్యుత్తును సర్వం ఆదానీ కంపెనీలకు అప్పజెప్పే ప్రయత్నమే ఈ స్మార్ట్ మీటర్ ప్రయోగం అని అన్నారు. ఇప్పటికే కరెంటు బిల్లుల పేరుతో ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు దూరం చేస్తున్న ఈ ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లు వస్తే ఏ ఒక్క సంక్షేమ పథకం కూడా అందుకోలేని పరిస్థితి నెలకొంటుందన్నారు. ఆగస్టు 5వ తేదీన విద్యుత్తు సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం చేసింది కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆర్.వెంకటేశ్వర్లు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు యు. శివయ్య బి సాంబయ్య కౌలు రైతు సంఘం నాయకులు సంకూరి నీలాంబరం మహిళా సంఘం జిల్లా కార్యదర్శి రెంటాల కుమారి ఏఐటీయూసీ నాయకులు రామిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ, శివాజీ



పోలింగ్ బూతులను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డిప్యూటీ కలెక్టర్

ప్రజాశక్తి - దుగ్గిరాల

పెరుగుతున్న ఓటర్లను దృష్టిలో ఉంచుకొని దుగ్గిరాల జడ్‌పి హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం డిప్యూటీ కలెక్టం, మంగళగిరి నియోజకవర్గం ఎలక్ట్రోలర్ ఆఫీసర్ ఏ.లక్ష్మీ కుమారి పరిశీలించారు. ఆమె మాట్లాడుతు 1200కన్నా ఎక్కువ ఓటర్లు ఉన్న కేంద్రాలనును రెండుగా విభజిస్తారని తెలిపారు. దుగ్గిరాలలోని బూత్‌నెంబర్ 265, 267, పేరుకలపూడి గ్రామంలోని 276 పోలింగ్ కేంద్రాలలో 1200 కన్నా ఎక్కువ మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. పెరుగుతున్న ఓటర్లను దృష్టిలో ఉంచుకొని వీటి సంఖ్య కూడా పెంచవలసి ఉంటుంద న్నారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతు విద్యార్థులు పోషకాహారం తీసుకోవాలని లేకుంటే అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎస్.శోభాదేవి, డిప్యూటీ తహశీల్దార్ ఎం.శివయ్య మండల సర్వేయర్ గోపాలరావు వీఆర్వోవర్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దాడులను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని గుంటూరు జిల్లా వైఎస్ఆర్సిపి యాక్టివిటీ కార్యదర్శి మల్లవరపు సుధారాణి అన్నారు. శుక్రవారం కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టిడిపి కార్యకర్తలు దాడి చేయడాన్ని ఖండిస్తూ మంగళగిరి నియోజకవర్గం వైఎస్ఆర్సిపి కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం చేస్తున్న అరాచకాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని ఆరోపించారు. మహిళలు బయటకు రావడానికి భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జగన్మోహన్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో మహిళలపై దాడులు జరుగుతున్నాయని ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అన్నారని గుర్తు చేశారు. నియోజకవర్గం వైఎస్ఆర్సిపి మహిళా అధ్యక్షురాలు సిహెచ్ ఫిలోమినా మాట్లాడుతూ రాష్ట్రానికి మహిళ హోంమంత్రిగా ఉన్నప్పటికీ దాడులను అరికట్టడంలో విఫలమయ్యారని ఆరోపించారు. సమావేశంలో వైఎస్ఆర్సిపి మహిళ జిల్లా ఉపాధ్యక్షురాలు పి రత్నకుమారి, పట్టణ మహిళా అధ్యక్షురాలు ఎస్ సునీత, తాడేపల్లి మహిళా నాయకురాలు దర్శి విజయ పాల్గొన్నారు.

గుండె సమస్యలకు నూతన పరిష్కారం

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలోని ఫార్మసీ కళాశాలలో పరిశోధన విద్యార్థిని శ్రేయ కొసనం గుండె సంబంధిత సమస్యలకు, మొక్కల ఆధారిత చికిత్సలకు నూతన పరిష్కారాలను కనుగొన్నట్లు కెఎల్ ఫార్మసీ కళశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చక్రవర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ రాజేశ్వరి పసుపుల మార్గదర్శకత్వంలో గుండె సంబంధిత వ్యాధులపై పరిశోధన చేసిన శ్రేయ కొసనం సాంప్రదాయ మొక్కల నుండి పలు రకాల గుండెకు ఏర్పడే పలు రకాల సమస్యలకు ఔషదాలు తయారు చేయవచ్చుననే నివేదికను తయారు చేసినట్లు ఆయన తెలిపారు. అందుకు గాను శ్రేయ కొసనం కెఎల్ ఫార్మసీ కళాశాల నుండి పిహెచ్ డి డిగ్రీని అందుకున్నట్లు తెలిపారు. ఆమె చేసిన పరిశోధనను మెడికల్ పరిభాషలో ఇన్వెస్టిగేషన్స్ ఆన్ మిథైల్ గ్లైకోసైడ్ అండ్ సిన్నమోయిల్ డెరివేటివ్ ఫ్రమ్ అగనోస్మా డైకోటోమా ఎగైనెస్ట్ మయోకార్డియల్ ఇస్కీమియా-రిపెర్ఫ్యూజన్ ఇంజురీ, ఇంటిగ్రేటింగ్ కంప్యూటేషనల్ టెక్నిక్స్ విత్ సెల్‌లైన్ వాలిడేషన్ యూజింగ్ హెచ్9సి2 కార్డియో మయోసైట్స్ అంటారనీ, తన థీసిస్‌కు కెఎల్‌యు ఫార్మసీ కళాశాల వారు శ్రేయ కొసనమ్‌కు పిహెచ్‌డి ప్రధానం చేసినట్లు పేర్కొన్నారు. ఆమెను కెఎల్ ఫార్మసీ కళశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చక్రవర్తి, డైరెక్టర్ డాక్టర్ బుచ్చి నాయుడు, ఆర్ ప్యాక్ చైర్మన్ డాక్టర్ నరేంద్ర ఆమెను అభినందించారు.



ఎన్‌సిసికి ఎంపికైన విద్యార్థులు

ఎన్‌సిసి ఎంపికలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక కొత్తపేటలోని శ్రీ రావి సాంబయ్య మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో 2025-26 ఏడాదికి ఎన్‌సిసి శిక్షణ పొందేందుకు 8, 9 తరగతుల విద్యార్థులకు ఎంపికలు నిర్వహించారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన దేహధారుడ్య పరీక్షల్లో 130 మంది పాల్గొనగా 81 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.భారతి తెలిపారు. ఎన్సిసి క్యాడెట్‌లకు ఎంబిబిఎస్, బిడిఎస్ అగ్రికల్చర్, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, డైరీ టెక్నాలజి ఇతర కోర్సులలో రిజర్వేషన్‌తో పాటు ప్రభుత్వ రంగాలలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందని ఎన్సిసి కేర్‌టేకర్ కొడాలి గోవర్ధన తెలియజేసారు. విద్యార్థులను ఎంపిక చేసినవారిలో 22 ఆంధ్ర బెటాలియన్ పిఐ స్టాఫ్ సుబేదార్ రాకేష్‌కుమార్, హవాల్దార్‌చరణ్, హవాల్దార్ రామన్‌ఠాగూర్, గర్ల్స్ క్యాడేట్ ఇన్స్ట్రక్టర్ నవ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.



విద్యార్థికి పుస్తకాలు అందజేస్తున్న జంగాల వెంకటేష్

ఉచిత నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - తాడేపల్లి

ఐటీ, ఎలక్ట్రానిక్స్ విద్యాశాఖమంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో తెలుగు యువత గుంటూరు పార్లమెంటు ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్ ఆర్థిక సహకారంతో రాజధాని ముఖద్వారంగా ఉన్న ఉండవల్లి జడ్పీహెచ్ హైస్కూల్లోని ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు సుమారు రూ.40వేల విలువ గల నోట్ బుక్కులు, జామెంట్రీ బాక్సులు, పెన్నులు,పెన్సిల్లు, ఎరైజర్లు షాప్నర్లు, కిట్లు, శుక్రవారం ఉచితంగా పంపిణీ చేశారు. జంగాల వెంకటేష్ మాట్లాడుతూ రాబోయేరోజుల్లో ఏపీ విద్యావ్యవస్థను దేశంలోనే ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని అన్నారు. విద్యార్థులు ఇప్పటినుంచే బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఈ శాంతకుమారి, ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు దాసరి కృష్ణ, లింగం శెట్టి కిషోర్, టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు వంగా నరేంద్ర, జనసేన పార్టీ గ్రామ పార్టీ అధ్యక్షులు సిగిరి శెట్టి రాజా రమేష్, వల్లభాపురం శంకర్, సంకూర్ ప్రశాంత్, కునపురెడ్డి రమేష్, గాదె శ్రీనివాసరావు, సనక బుచ్చిబాబు, గోపాలం కొండలరావు, లాంనరేష్, రాయపూడి కిరణ్, లీలా కృష్ణ, కమలనాభూడు, భార్గవ్, ఉదయ్, రాము, మౌనిక, సీతా,సింగంశెట్టి శ్రీనివాసరావు, శిముడు, తేజా పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండలంలోని వరగాని ఎంపీపీఎస్ (ఎస్ డబ్ల్యు) పాఠశాలలోని విద్యార్థులకు దాత చెన్నుపాటి శివ నాగేశ్వర రావు సహకారంతో శుక్రవారం ఉచితంగా నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి కెఎఫ్ కెనడి హాజరయ్యారు. ఈ సందర్భంగా కెనడి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదిగి తమ బడి రుణం తీర్చుకోవాలని ఆకాంక్షించారు. దాత చెన్నుపాటి శివ నాగేశ్వరరావు మాట్లాడుతూ గురువులు, తల్లిదండ్రులు గర్వించేలా ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. నేటి బాలలే రేపటి పౌరులని కుటుంబంతో బాటు సమాజానికి ఉపయోగపడాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నిమ్మగడ్డ నాగేశ్వరరావు, చెన్నుపాటి సురేంద్ర, బండారు రాంబాబు, అంచా రత్తయ్య, ఏకా సాయిబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లోవిందు రామారావు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా 2025-26 విద్యా సంవత్సరంలో పదవ తరగతి, ఇంటర్‌లో అడ్మిషన్లు ప్రారంభం అయినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా జులై 30వ తేదీ వరకూ అడ్మిషన్లకు గడువు ఉందన్నారు. 14 సంవత్సరాలు నిండిన వారు, చదువు మధ్యలో మానేసినవారు, అక్షరజ్ఞానం కలిగిన వారు పదవ తరగతిలో అడ్మిషన్ పొందవచ్చన్నారు. 15 సంవత్సరాలు నిండిన వారు ఇంటర్ పరీక్షలు దూరవిద్య ద్వారా రాయవచ్చన్నారు. వివిధ కారణాలతో చదువు మధ్యలో ఆపేసిన వారికి ఇదొక సువర్ణ అవకాశమని, గ్రామీణ ప్రాంత మహిళలు, వృత్తి, వ్యాపార రంగాల్లో ఉన్న వారికి ఇది ఒక మంచి అవకాశమన్నారు. కావున ఓపెన్ స్కూల్లో చేరాలనుకునే వారు స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుల, ఎంఇఒ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. గుర్తింపు పొందిన అధ్యయన కేంద్రాలను deognt.blogspot.in వెబ్‌సైట్‌లో ఉన్నాయని, సమీపంలోని అధ్యయన కేంద్రాన్ని సందర్శించి అడ్మిషన్ నమోదు చేసుకోవచ్చన్నారు.

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిపై పలు కేసులు

ఒకే రోజు.. ఒకటే కార్యక్రమం.. మూడు పోలీస్ స్టేషన్‌లలో నమోదు

సత్తెనపల్లిలో విచారణకు హాజరైన లేళ్ల అప్పిరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ రెంటపాళ్ళ పర్యటన నేపథ్యంలో వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణల నేపథ్యంలో శాసనమండలి సభ్యులు శుక్రవారం సత్తెనపల్లి రూరల్ పోలీసు స్టేషన్‌కు విచారణకు హాజరు అయ్యారు. జగన్ పర్యటన నేపథ్యంలో అప్పిరెడ్డిపై ఇప్పటి వరకు మూడు కేసులు నమోదు అయ్యాయి. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించారనీ.. అనుమతి లేకుండా జన సమీకరణ చేశారనీ.. గుంటూరు నగరం పాలెం పోలీస్ స్టేషన్‌లో తొలుత కేసు నమోదైంది. తర్వాత డీజే ఏర్పాటు అంశాన్ని కూడా జోడించి సత్తెనపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదు చేశారు. తాజాగా ఇవే ఆరోపణలతో సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో మూడో కేసు ఫైల్ చేశారు. తొలుత ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డికి 41ఏ నోటీసు అందజేశారు. అనంతరం సత్తెనపల్లి పట్టణ పోలీసులు ఇచ్చిన నోటీసులకు అనుగుణంగా ఆయన ఈ నెల 11వ తేదీన సత్తెనపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. అయితే ఆ సందర్భంలో 41ఏ నోటీసు ఇచ్చి పంపించేశారు తాజాగా సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో రెండో కేసు నమోదు చేసి హడావుడిగా మళ్ళీ నోటీసులు జారీ చేశారు. దీంతో ఆయన విచారణకు హాజరు అయ్యారు.

రజకవృత్తిదారుల సమస్యలపై 22న రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ ప్రకారం రజకులకు సామాజిక రక్షణ చట్టం వెంటనే ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన రజక అభివద్ధి -సంక్షేమ కార్పోరేషన్‌కు విధి, విధానాలు రూపొందించి రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ఖర్చు చేయాలని, రజక లాండ్రీ వత్తిదారులకు నెలకు 250 యూనిట్లు కరెంటు ఉచితంగా అందించాలని తదితర డిమాండ్లతో ఈనెల 22న పాతగుంటూరు, సిఐటియు కార్యాలయంలో జరిగే రౌండ్‌టేబుల్ సమావేశంలో రజకసోదరులు అందరూ పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వల్లభాపురం వెంకటేశ్వరరావు కోరారు. గుంటూరులో జరిగిన సంఘం నగర కమిటీ సమావేశంలో వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది అవుతున్నా ఇంత వరకూ హామీలు అమలు చేయలేదన్నారు. హామీల సాధన కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో రజక వత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి బొజ్జ సుబ్బారావు, జిల్లా అధ్యక్షులు మండూరు వెంకట నరసయ్య, నగర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు బెండమూరి లంక కైలాసం, పేరుపాలెం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న అధికారులు

విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ తనిఖీలు

ప్రజాశక్తి-గుంటూరు

విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల తయారీ, టోకు వర్తలు, రిటైల్ డీలర్ల దుకాణాలలో శుక్రవారం వ్యవసాయశాఖ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా రెండు బృందాలుగా తనిఖీలు నిర్వహించారు. గుంటూరునగరంతోపాటు, మేడికొండూరు ఫిరంగిపురం మండలాల్లో తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో 6 ఎరువుల దుకాణాల్లో రూ.4.92 లక్షల విలువైన 1.13 టన్నుల ఎరువులు, 7 పురుగు మందుల దుకాణాల్లో రూ.44వేల విలువైన 27.5 లీటర్ల పురుగు మందులు, 6 విత్తన దుకాణాల్లో రూ.23.60 లక్షల విలువైన 82.3 లక్షల మెట్రిక్ టన్నుల విత్తనాలు అమ్మకాలను సరైన పత్రాలు లేనందున విక్రయాలు నిలుపుదల చేశారు. అంతేకాకుండా 1.29 లక్షల విలువైన 78.57 లీటర్ల పురుగుమందులు స్వాధీనం చేసుకొని 6ఎ కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీలలో జిల్లా వ్యవసాయాధికారి ఎ.నాగేశ్వరరావు, పశ్చిమ గోదావరి ఎడిఎ పి.మురళికృష్ణ, గన్నవరం ఎడిఎ ఎం.సునీల్, విజిలెన్స్ ఇనెస్పెక్టర్లు కె.వెంకటేశ్వర్లు, సిహెచ్.రవిబాబు, గుంటూరు డిఎఒ ఆఫీసు వ్యవసాయాధికారి సునీల్‌కుమార్, గుంటూరు రూరల్ మండలం ఏఒ బి.కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

త్వరలో ఇన్నర్ రింగ్ రోడ్డు మూడోదశ పనులు

కేంద్ర మంత్రి పెమ్మసాని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు-విజయవాడ మార్గంలో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్ రోడ్ నిర్మాణం మూడో దశ పనులు త్వరలో ప్రారంభం అవుతాయని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు నగర అభివద్ధికి మరొక కీలక అడుగుగా ఇన్నర్ రింగ్ రోడ్ మూడో దశ నిర్మాణంకు రూ. 48 కోట్ల అంచనా వ్యయంతో ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటిఫికేషన్ కూడా విడుదల చేసిందన్నారు. శుక్రవారం రహదారి నిర్మాణంపై ఆయన అధికారులతో కలసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. జూలై 18 నుంచి ఆగస్టు 1 వరకు టెండర్ దాఖలు ప్రక్రియ కొనసాగనుందన్నారు. ఈ నిర్మాణం పూర్తయిన తర్వాత జెకెసి కళాశాల నుంచి స్వర్ణభారతి నగర్ మీదుగా పెదపలకలూరు రోడ్ వరకు సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న రహదారి పూర్తి అవుతుందన్నారు. పల్నాడు వైపు నుంచి గుంటూరు వైపుగా వచ్చే ట్రాఫిక్‌ను డైవర్ట్ చేయడంలో ఉపయోగపడనుందన్నారు.



రహదారిని పరిశీలిస్తున్న పెమ్మసాని చంద్రశేఖ

జిజిహెచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స

రోగికి ఉదరంపై కణితి తొలగింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి జనరల్ సర్జరీ డిపార్ట్మెంట్‌లో అరుదైన సర్జరీ నిర్వహించినట్టు సూపరింటెండెంట్ డాక్టర్ రమణ ఎస్.ఎస్.వి, జనరల్ విభాగం సర్జరీ ఆచార్యులు డాక్టర్ జి.కిరణ్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదరం పై ఏర్పడిన డెస్మాయిడ్ ట్యూమర్ కి చికిత్సకి ఆరు లక్షల ఖరీదు ఆపరేషన్ ను యన్ టి ఆర్ వైద్యసేవ క్రింద ఉచితం గా నిర్వహించామన్నారు. ఈ డెస్మండ్ కణితి ప్రతి 10 లక్షల మందిలో ఇద్దరు నుంచి నలుగురికీ మాత్రమే వచ్చే అరుదైన ట్యూమర్ అని వారు వివరించారు. గుంటూరు కి చెందిన 28 సంవత్సరాల జీవన్ స్రవంతి రెండు సంవత్సరాల క్రితం 3 నెలల గర్భిణి గా వున్నపుడు బొడ్డు పై హెర్నియా కి ల్యాప్రోస్కోప్ ద్వారా ఒక ప్రైవేట్ ఆసుపత్రి లో చికిత్స చేయుంచుకున్నారు. తరువాత రెండు నెలలకు పొట్ట మీద కణిత వచ్చింది అని గుర్తించారు. అది క్రమేపీ పెరిగి పెద్దది అవుతుండడంతో పలు ఆసుపత్రులు తిరిగి చివరకు గుంటూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ జి.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య బృందం రోగిని పరీక్షించారు. అవసరమైన పరీక్షలు చేయించి శస్త్ర చికిత్స చేశారు. కణిత డెస్మాయిడ్ ట్యూమర్ గా నిర్ధారించారు. ఇటువంటి కణితలు క్యాన్సర్ గా మారే అవకాశం వుందన్నారు. ఇటువంటి అరుదైన శాస్త్ర చికిత్స ను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి లో ఎటువంటి ఇబ్బంది లేకుండా చేయడానికి సహకరించిన సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.రమణ గారికి, జనరల్ సర్జరీ విభాగదీపతి డాక్టర్ కిరణ్ కుమార్ , సర్జరీ ఫోర్త్ యూనిట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.కిరణ్ కుమార్ గారి బందం కు రోగి కుటుంబ సభ్యులు కతజ్ఞతలు తెలియజేశారు. వైద్యులు అరుణ , గీతిక, అక్షయ్, సత్యదేవ్, రవి, పావని, వెంకట రమణ, పోలయ్య, శాంసన్,సంతోష్ పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి

టిడ్కో గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి పరిధిలోని టిడ్కో గృహ సముదాయాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. కొద్దిపాటి వర్షానికి రోడ్లు బురద మయంగా మారడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. బ్యాంక్ రుణ భారంతో లబ్ధిదారులు సతమతవవుతున్నారు. తాగునీరు సక్రమంగా సరఫరా కాకపోవడం, రాత్రి వేళల్లో ఆకతాయిల ఆగడాలు నిత్యకత్యంగా మారాయని సిపిఎం బృంద నాయకులు ఎం రవి, బిలక్ష్మణరావు, ఎం భాగ్యరాజు తెలిపారు. శుక్రవారం వారు రాజధాని గ్రామం తుళ్లూరులోని టిడ్కో గృహ సముదాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గృహ లబ్ధిదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువు పెట్టారు. చిన్నపాటి వర్షానికి టిడ్కో గహ సముదాయాల వద్ద ఉన్న రోడ్లు జలమయమై తటకాన్ని తలపిస్తున్నాయని, బురద రోడ్డు స్థానంలో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని, టిడ్కో గృహాల పై అంతస్తులో స్లాబు నుండి వర్షపు నీరు కారుతోందని, చెదల సమస్య తీవ్రంగా ఉందని, తాగునీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, మురుగు పారుదల కూడా సక్రమంగా ఉండటం లేదని తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లాకార్యదర్శివర్గ సభ్యులు ఎం రవి జిల్లా నాయకులు బి లక్ష్మణరావు మాట్లాడారు. టిడ్కోగృహాలకు చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడం వల్ల ఆకతాయిలు, తాగుబోతుల ఆగడాలు మితి మీరుతున్నాయని, అధికారుల దృష్టికి తీసుకు వెళితే తమకు సంబంధం లేదంటూ ఒకరిపై ఒకరు చెప్పడం తప్ప సమస్యలు పరిష్కరించిన పాపాన పోవడం లేదని, రాజధాని అమరావతిలో ప్రభుత్వం నిర్మించిన టిడ్కో గృహాకు బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి లేక ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న లబ్ధిదారులపై బ్యాంకు యజమానుల వేధింపులను నిలిపివేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. బ్యాంకు అధికారులు పదేపదే నోటీసులు ఇస్తూ ఇళ్లకు తాళాలు వేస్తామని బెదిరింపులు చేస్తుండడంతో వీరు ఆందోళనలకు గురవతున్నారని అన్నారు. టిడ్కో గృహ సముదాయాలలో పోలీస్ చెక్ పోస్ట్ పెట్టాలని, నిఘా పెట్టాలని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ చెప్పినా పోలీస్ శాఖ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వం, సిఆర్‌డిఎ అధికారులు యుద్ధప్రాతిపదికన టిడ్కో గృహ సముదాయాలలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రాజధాని లోని టిడ్కో గహ లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించే విషయంలో ప్రభుత్వం, సి ఆర్ డి ఎ అధికారులు తక్షణ చర్యలు చేపట్టకపోతే లబ్ధిదారులందరినీ సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు.హెచ్చరించారు. సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు ఎం భాగ్యరాజు మాట్లాడుతూ,టిడ్కో లబ్ధిదారుల రోదన అరణ్యా రోదనగా మారిందని, పట్టించుకునే నాధుడే కరువయ్యాడని అన్నారు. బ్యాంకు అధికారులు వడ్డీల పై వడ్డీలు వేస్తూ మహిళలకు డ్వాక్రా రుణాలు మంజూర యితే వారి అనుమతి లేకుండానే ఆ డబ్బులు నుండి పెద్ద మొత్తం టిడ్కో గహాల ఖాతాలో జమ చేసుకుంటున్నారని, ఈ పద్ధతి సరైంది కాదన్నారు.ప్రభుత్వం,సి ఆర్ డి ఎ అధికారులు ఇ ప్పటికైనా స్పందించి లబ్ధిదారుల బ్యాంకు రుణాలను రద్దు చేయాలని కోరారు.



తుళ్లూరులో టిడ్కో గృహాలను పరిశీలించిన సిపిఎం బృందం